ప్రజాశక్తి

శనివారం 16 డిసెంబరు 2023 | 8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

మచిలీపట్నంలో కలెక్టరేట్ ముట్టడిలో ఆశాలు; విజయవాడలో మాట్లాడుతున్న సిబిఐ మాజీ జెడి లక్ష్మీనారాయణ (అంతర్‌చిత్రంలో)

కలెక్టరేట్‌ను ముట్టడించిన ఆశాలు

పోలీసులు, ఆశాల మధ్య తోపులాట • రోడ్డుపై బైఠాయించి నిరసన

మచిలీపట్నం, విజయవాడల్లో విజయవంతంగా ముగిసిన 36 గంటల ధర్నా

ఆశాల 36 గంటల మహాధర్నా శుక్రవారం విజయవంతంగా ముగిసింది. విజయవాడ, మచిలీపట్నంలో జరిగిన ఈ మహాధర్నా, వంటా-వార్పు కార్యక్రమాల్లో ఆశాలు వందలాది మంది పాల్గొన్నారు. ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల నలుమూలల నుండి ఆశాలు పెద్దఎత్తున తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆశ వర్కర్లు కృష్ణాజిల్లా కలెక్టరేట్‌ను ముట్టడించారు. నిరసన దీక్ష అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చేందుకు వెళుతుండగా, కృష్ణాజిల్లా కలెక్టర్ ధర్నా చౌక్ వద్దకు భారీగా చేరుకున్న పోలీసులు ఆశా కార్యకర్తలను అడ్డుకున్నారు. దీంతో వారి ఇరువురు మధ్య తోపులాట చోటు చేసుకుంది. దీంతో కార్యకర్తలు బారికేడ్లను తోసుకుంటూ కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ప్రధాన గేటు ఎదుట రోడ్‌పై బైఠాయించి ప్రభుత్వానికి, వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం సంఘ నాయకులకు, పోలీసులకు మధ్య జరిగిన చర్చలు సఫలం కావడంతో నిరసన కార్యక్రమం విరమించారు. విజయవాడలో జరిగిన ధర్నా వద్దకు సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ వచ్చి ఆశాల ఆందోళనకు సంఘీభావం తెలిపారు. ఎన్‌హెచ్‌ఎం స్కీమ్ కింద ఆశా వర్కర్లు పేదలకు ఆరోగ్యపరమైన సేవలందించటంలో కీలకపాత్ర పోషిస్తున్నారని, అటువంటి వారి సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆశాల సమస్యలను తాను కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు స్వయంగా లేఖ ద్వారా తెలియజేస్తానని చెప్పారు.

(పూర్తి వివరాలు లోపలి పేజీల్లో)

అంగన్వాడీల సమ్మెపై ఉక్కుపాదం

• సచివాలయ సిబ్బంది పర్యవేక్షణలోకి కేంద్రాలు • తాళాలు పగలగొట్టిన సిబ్బంది

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి అంగన్వాడీలు చేపట్టిన సమ్మెపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మె శుక్రవారం నాలుగో రోజుకు చేరుకుంది. కార్యకర్తలు, ఆయాలు చేస్తున్న సమ్మెను ఖాతరు చేయని ప్రభుత్వం... మూతపడిన అంగన్వాడీ కేంద్రాలను బలవంతంగా తెరిపించేందుకు పూనుకుంది. అంగన్వాడీ కేంద్రాలను తెరవడానికి సచివాలయ ఉద్యోగులను ప్రయోగించింది. సమ్మెతో మూతపడిన అంగన్వాడీ కేంద్రాలను తెరవాలని జిల్లా కలెక్టర్లు, మండల పరిషత్ అధికారులు, నగర పాలక సంస్థ, మున్సిపల్ కమిషనర్లకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. వీరి పర్యవేక్షణలోనే సచివాలయ సిబ్బంది తమకు కేటాయించిన అంగన్వాడీ కేంద్రాల తాళాలను పగులగొట్టారు. ఆయా కేంద్రాల్లో ఉన్న రికార్డులను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. కృష్ణాజిల్లా గూడూరు మండలం పోసినవారిపాలెం శివారు గంజ్వాలవారిపాలెం అంగన్వాడీ కేంద్రం తాళాలు తెరవకుండా గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో జిల్లా జాయింట్ కలెక్టర్ అపరాజితాసింగ్ సిన్వార్ ఆ గ్రామానికి వెళ్లి అంగన్వాడీ కేంద్రాన్ని తెరిపించారు. ఈ కేంద్రంలోని పిల్లలకు పక్కన స్కూల్‌లో భోజన ఏర్పాట్లు చేశారు. అంగన్వాడీలు తాళాలు వేసిన కేంద్రాలను తెరవాలని అధికారులపై ప్రభుత్వం చేస్తున్న ఒత్తిడి ఎంతగా ఉందో ఈ సంఘటన నిదర్శనంగా ఉంది. జిల్లాలో సచివాలయ ఉద్యోగులు తెరిచిన అంగన్‌వాడీ కేంద్రాల వివరాలను గంటగంటకు జిల్లా అధికారులు ప్రభుత్వానికి అందించారు.

గూడూరు మండలం పోసినవారిపాలెం శివారు గంజ్యాలవారిపాలెం అంగన్వాడీ కేంద్రంలోని చిన్నారులతో కలిసి భోజనం చేస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్ అపరాజితాసింగ్

ఈనేపథ్యంలోనే జిల్లాలోని 1707 కేంద్రాలకుగాను 1706 కేంద్రాలను తెరిచినట్లు ఐసిడిఎస్ పీడీ సువర్ణ ప్రకటించారు. సమీపంలోని పాఠశాలల్లో అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు భోజనాలు ఏర్పాటు చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

సమ్మెకు సంఘీభావం

అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు చేస్తున్న సమ్మెకు సంఘీభావంగా శుక్రవారం సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యాన మచిలీపట్నం గాంధీ విగ్రహం వద్ద నుంచి కలెక్టరేట్ ధర్నా చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. వీరి ఆందోళనకు ఎల్ఐసి ఏజెంట్ల అసోసియేషన్ కూడా సంఘీభావం తెలిపింది.

ధాన్యం నాణ్యతపై ఎఫ్‌సిఐ బృందం పరిశీలన

ప్రజాశక్తి - ఘంటసాల, గూడూరు : మిచౌంగ్ తుపాను ప్రభావంతో దెబ్బతిన్న ప్రాంతాలను శుక్రవారం ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా బృందం పరిశీలించింది. ఎఫ్‌సిఐ క్వాలిటీ కంట్రోల్ మేనేజర్లు యూసఫ్, డాక్టర్ బసంత్, జి.కిరణ్, ఇ.రామప్రసాద్‌తో (మిగతా 6లో)

పండిన పంట నీటికి నాని మొలకలతో: అట్ట కట్టిన వైనాన్ని చూపిస్తున్న వెంకటాపురం రైతు

తాళాలు పగులగొట్టడాన్ని

అడ్డుకున్న ప్రజా సంఘాల నేతలు

అంగన్వాడీ కేంద్రాల వద్ద నుండి వెనుదిరిగిన సచివాలయ సిబ్బంది

ప్రజాశక్తి - నందిగామ, అజిత్‌సింగ్‌నగర్ : అంగన్వాడీ కేంద్రాల తాళాలను ప్రభుత్వం సచివాలయ సిబ్బందితో పగలగొట్టేందుకు చేసిన ప్రయత్నాలను శుక్రవారం పలు ప్రజా సంఘాల నాయకులు, స్థానికులు అడ్డుకున్నారు. విజయవాడ, నందిగామల్లోని పలు అంగన్వాడీ కేంద్రాలను బలవంతంగా తెరిచేందుకు వచ్చిన సచివాలయ సిబ్బందిని ప్రజా సంఘాల నేతలు అడ్డుకున్నారు. సమ్మె (మిగతా 6లో)

నందిగామ హనుమంతుపాలెంలో అంగన్వాడీ కేంద్రం వద్ద సచివాలయ సిబ్బందిని అడ్డుకున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు తదితరులు

విజయవాడ సింగ్‌నగర్‌లో అంగన్వాడీ కేంద్రం వద్ద ప్రజా సంఘాల నాయకులు కె.శ్రీదేవి, కె.దుర్గారావు తదితరులు

అంగన్వాడీలకు మద్దతుగా గన్నవరం జరిగిన ప్రదర్శనలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, కృష్ణాజిల్లా కార్యదర్శి వై.నరసింహారావు తదితరులు

పేదల ముంగిటకే కార్పొరేట్ వైద్యసేవలు

రాష్ట్ర హోం, జిల్లా ఇన్చార్జి మంత్రి తానేటి వనిత

ప్రజాశక్తి - అజిత్‌సింగ్‌నగర్ : వైఎస్సార్ గ్రామీణ పట్టణ ఆరోగ్య కేంద్రాల ద్వారా అత్యాధునిక మౌలిక వసతులను కల్పించి ఆధునిక విద్య సహాయాన్ని అందిస్తున్నామని, రాష్ట్ర హెూం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి, జిల్లా ఇంచార్జ్ మంత్రి తానేటి వనిత అన్నారు. డా.వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సహాయాన్ని రూ.25 లక్షలకు పెంచి దివంగత నేత డా. వై. ఎస్. రాజశేఖర్ రెడ్డి ఆశయాలను మరింతగా అమలు చేసి పేదలకు మెరుగైన శస్త్ర చికిత్సలు ఉచితంగా అందిస్తున్నామని, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా ప్రజల ఆరోగ్య పరిస్థితులను ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు. విజయవాడ 60వ డివిజన్ వాంబే కాలనీలో రూ.1.07 కోట్లతో నిర్మించిన అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను శుక్రవారం స్థానిక శాసన సభ్యులు మల్లాది విష్ణు వర్ధన్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. అనంతరం మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ దేశ చరిత్రలో ఏ రాష్ట్రం అమలు చేయని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై. ఎస్. జగన్ మోహన్ రెడ్డి వైద్య రంగంపై ప్రత్యేక దష్టి పెట్టి వేల కోట్ల రూపాయలు మంజూరు చేసి ప్రభుత్వ ఆసుపత్రులను కార్పొరేట్ ఆసుప్రతులకు దీటుగా తీర్చి దిద్దారన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో (మిగతా 6లో)

అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి తానేటి వనిత, చిత్రంలో ఎంఎల్ఏ విష్ణు, మేయర్ భాగ్యలక్ష్మి

నిరాధార ఆరోపణలొద్దు : సామినేని

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎంతో చైతన్య వంతు లని, రామోజీ రావు తన ఈనాడు పత్రికలో రాసే తప్పుడు వార్తలను ఎట్టి పరిస్థి తుల్లో నమ్మ బోరని ప్రభుత్వవిప్, జగ్గయ్య పేట శాసన సభ్యులు సామినేని ఉదయభాను శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనాడు పత్రిక తెలుగుదేశం పార్టీ కరపత్రికగా మారిందని పేర్కొన్నారు. ఆ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలతో వార్తలను ప్రచురిస్తున్నారని, పేద పిల్లల చదువులపై దుష్ప్రచారం చేయడం సిగ్గుచేటని తెలిపారు. ట్యాబ్‌లపై అనవసర రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విద్యకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ విప్లవాత్మక మార్పులు తెచ్చారని పేర్కొన్నారు. గత డిసెంబర్‌లో 5.18 లక్షల ట్యాబ్ లను విద్యార్థులకు అందించగా, ఈ ఏడాది కూడా మరో 4.35 లక్షల ట్యాబ్‌లను ఇవ్వనున్నారని తెలిపారు.

కిడ్నీ వ్యాధికి మరొకరు బలి

ప్రజాశక్తి - ఎ.కొండూరు : చీమలపాడు గ్రామంలో కిడ్నీ సమస్యతో మరో మహిళ మృతిచెందింది. మతురాలు షేక్ ఫాతి మున్నీసా (55) శుక్రవారం ఉదయం తిరువూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమె భర్త గాలి షరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం ఫాతి మున్నిసా ఆరు నెలలుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతుందని విజయవాడలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో లక్ష రూపాయల వరకు ఖర్చు పెట్టి వైద్యం చేయించామని తెలిపారు. ఇటీవల వ్యాధి తీవ్రత ఎక్కువవడంతో ఆర్థిక స్థోమత లేక తిరువూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం చేయిస్తున్నట్లు తెలిపారు. మతురాలికి కుమారుడు కుమార్తె ఉన్నారు. మున్నిసా మృతదేహానికి సిపిఎం నాయకులు పి.ఆనందరావు సోమ మోహనరావు నివాళులర్పించారు. మృతురాలి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు

ఎల్‌బిఆర్‌సిఇలో వర్క్‌షాప్ ప్రారంభం

ప్రజాశక్తి - మైలవరం : తనికెళ్ళకిరెడ్డి బాల్రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో సిఎస్సి విభాగం ఆధ్వర్యంలో రెడ్ హాట్ లైన్ ఎక్స్‌పై మొదటి సంవత్సరం విద్యార్థులకు రెండు రోజులు పాటు జరిగే వర్క్ షాప్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు మాట్లాడుతూ నేటి ఆధునిక ప్రపంచంలో ఆపరేటింగ్ సిస్టంలో వివిధ టెక్నాలజీలలో స్కిల్స్‌ను పెంపొందించుకోవాలన్నారు. ఈ వర్క్‌షాప్‌లో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఓటర్లకు అవగాహన

జగ్గయ్యపేట: నియోజక వర్గ పరిధిలో గల పోలింగ్ స్టేషన్ల పరిధిలోని ఓటర్లకు ఈవిఎం, వివిపిఎటిలపై అవగాహన కార్యక్రమం శుక్రవారం ఏర్పాటు చేశారు. పట్టణంలోని తహశీల్దారు కార్యాలయం, 13వ వార్డు సచివాలయం పోలింగ్ స్టేషన్లలో 54, 55, 56ల పరిధిలో అవగాహన కల్పించినట్లు తహశీల్దార్ ఎం.సూర్యారావు తెలిపారు.

వన్‌టౌన్‌లో వ్యక్తి దారుణ హత్య

మృతుడు ఏసు (ఫైల్)

ప్రజాశక్తి - వన్‌టౌన్ : నిత్యం రద్దీగా ఉండే వన్‌టౌన్ రమణయ్య కూల్‌డ్రింక్ షాపు సెంటర్‌లో ఓ వ్యక్తి దారుణ హత్యకు గుర య్యాడు. వన్‌టౌన్ పోలీసుల కథనం ప్రకారం గట్టు వెనుక ప్రాంతమైన కబేళా ప్రాంతంలోని ఓ గ్యాస్ గోడౌన్ సమీపంలో గొగ్గిలం ఏసు (39) (అలియాస్ వాసు) కుటుంబంతో కలిసి నివసిస్తు, మణికంఠ క్యాటరర్స్‌ను నిర్వహిస్తుంటాడు. అయితే విద్యాధరపురం నాలుగు స్తంభాల సెంటర్‌లో నివసించే మేడిబాల నాగార్జున (అలియాస్ గణేష్) (30) పెళ్ళి కాలేదు. ఇతను కూడా క్యాటరర్స్ పనులకు వెళ్తుంటాడు. ఈ నేపధ్యంలో మణికంఠ క్యాటరర్స్ నిర్వాహకుడు ఏసు గత కొంతకాలం క్రితం నాగార్జున (గణేష్)కు రూ. 15 వేలు వడ్డీకి అప్పుగా ఇచ్చాడు.బా బాకీ ఇంకా రూ. 5 వేలు చెల్లించాల్సి ఉంది. ఏసు డబ్బులు ఇవ్వాలని నాగార్జున (గణేష్)ను అడుగుతుండగా ఇటీవల వీరిద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో నాగార్జున మటన్ కత్తితో హల్‌చల్ చేస్తూ, గొగ్గిలం ఏసును మెడపై కత్తితో నరికాడు. దీంతో ఆ వ్యక్తి అక్కడి కక్కడే రక్తపు మడుగులో పడి మృతిచెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వా స్పత్రికి తరలించారు. సిసిపుటేజ్ అధారంగానే నిందితుడిని స్టేషన్‌కు తరలించారు.

అంగన్వాడీల ఉద్యమం ఉధృతం

నాల్గో రోజుకు చేరిన సమ్మె - స్పందించని ప్రభుత్వం - సచివాలయ సిబ్బంది చేతుల్లోకి కేంద్రాల తాళాలు

జిల్లా వ్యాప్తంగా సచివాలయ సిబ్బంది అంగన్వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టారు. దీంతో గ్రామస్తులు, ఆయా పార్టీల నాయకులు తాళాలు పగలగొట్టకుండా అడ్డుకున్నారు. అయినప్పటికీ వారిని పక్కకు నెట్టి పోలీసులు కూడా రంగంలోకి దిగి తాళాలు పగులగొట్టి కొత్త తాళాలు వేశారు. ఈ అధికారం ఎవరిచ్చారని అడిగినా లెక్క చేయలేదు. ఈ చర్యలను పలువురు నేతలు ఖండించారు.

ప్రజాశక్తి - విజయవాడ : అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్స్‌ను చర్చల ద్వారా పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావాలని, లేనట్లయితే విశాల ఐక్యం ద్వారా ఉద్యమాన్ని ఉధృతం చేయాల్సి వస్తోందని పలు సంఘాల నేతలు పిలుపునిచ్చారు. శుక్రవారం నాటికి అంగన్‌వాడీల సమ్మె నాలుగవ రోజుకు చేరింది. జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున తరలి వచ్చిన అంగన్‌వాడీలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. కనీస వేతనం రూ. 26 వేలు చేయాలని, వర్కర్లుగా గుర్తించాలని, సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని అంగన్‌వాడీలు డిమాండ్ చేశారు. కార్యక్రమానికి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అద్యక్షులు టి గజలక్ష్మీ అధ్యక్షత వహించారు. సమ్మెనుద్దేశించి సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు మాట్లాడుతూ నాలుగు రోజుల నుంచి లక్ష మందికి పైగా రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీలు ఆందోళనలు చేస్తున్నా ఈ ప్రభుత్వానికి చీమకుట్టినట్లుగా కూడా లేదని విమర్శించారు. అంగన్‌వాడీలు, ఆశాలు, తదితర రంగాల మహిళలు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనబాట పట్టినా శాంతియుతంగా చర్చల ద్వారా వారి న్యాయమైన డిమాండ్స్‌ను పరిష్కరించడానికి ప్రభుత్వం ముందుకు రాలేదని, రానున్న కాలంలో మహిళలు ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రోజా మాట్లడుతూ సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం అంగన్‌వాడీలపై బెదిరింపులు, అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగలకొట్టడం, దాడులకు దిగడం ప్రభుత్వ అహంకార చర్యకు నిదర్శనమని, ఇటువంటి వాటిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి నరసింహారావు, సిఐటియు నాయకులు ఏశోబు, యూనియన్ ట్రెజరర్ జయనీరత్నకుమారి, యల్లారాణి, ఉమాదేవి, పెన్షనర్స్ సంఘం నాయకులు ఎంఎన్‌పాత్రుడు, ఐద్వా నాయకులు ఆషా తదితరులు పాల్గొన్నారు. **నందిగామ:** నందిగామ శివారు ప్రాంతమైన 19వ వార్డు లో అంగన్వాడీ కేంద్రాల్లో తాళం తీయడానికి వచ్చిన అధికారులు లను ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు అడ్డు కున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు సమస్యలు పరిష్కారం కోసం ఆందోళన చేస్తుంటే పరిష్కరించవలసిన అధికారులు బాధ్యతని విస్మరించి అంగన్వాడీ సెంటర్ తాళాలు అక్రమంగా పగలగొట్టడం మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. నందిగామ మండలంలో లింగాలపాడు రాఘవపురం పలుచోట్ల అంగన్వాడి కేంద్రాలు తాళాలు పగలగొట్టడానికి వచ్చిన సచివాలయం సిబ్బందిని అడ్డుకున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్ ఎస్ఐ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సయ్యద్ ఖాసిం తదితరులు పాల్గొన్నారుమండలం లింగాలపాడు అంగనవాడి సెంటర్ 2 లో కొంతమంది వ్యక్తులు తాళాలు పగలగొట్టి చిన్నపిల్లలు తినే తిండి పదార్థాలు ధ్వంసం చేశారు. సామాన్లు చిందర వందర చేశారు. సచివాలయం పరిధిలోని రెవెన్యూ మహిళా పోలీస్ సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ అంగన్వాడి సెంటర్ తాళాలు పగలగొట్టడం పట్ల లింగాలపాడు గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంగనవాడి కార్యకర్తలు ఆయాలు వేతనాలు పెంపు కోసం సమస్యల పరిష్కార కోసం నిరవధిక సమ్మెలో భాగంగా నందిగామ తాసిల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తుంటే కనీసం ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా సచివాలయం సిబ్బంది తిలాదకాలకు మంగళం పాడుతూ అంగన్వాడి సెంటర్ ను తాళాలు పగలగొట్టడం ఏమిటంటే గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లింగాలపాడు గ్రామ అంగన్వాడి సెంటర్ తాళాలు పగలగొట్టి సామాన్లు ధ్వంసం చేసిన సచివాలయం సిబ్బంది మహిళా పోలీస్ పై నందిగామ మండల అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకులు సిఐటియు నాయకులు నందిగామ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. నందిగామ తహశీసిల్దార్ కార్యాలయంలో తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. తక్షణమే సచివాలయం సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నందిగామ మండల కార్యదర్శి కట్టారపు గోపాల్, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు కొల్లి సరళ సుజాత లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు. నేతాజీ సెంటర్‌లో నందిగామ నగర పంచాయతీ పరిధిలోని నేతాజీ సెంటర్ లో అంగన్వాడీ సెంటర్ తాళాలను సచివాలయం, రెవెన్యూ సిబ్బంది తాళాలను పగల కొట్టడానికి ప్రయత్నించడంతో స్థానికులు అడ్డుకున్నారు. నందిగామ పట్టణంలో పలు చోట్ల అంగన్వాడీ సెంటర్ తాళాలను తీసి మహిళా వాలంటీర్ లు నిర్వహించాలని అధికారులు సచివాలయం సిబ్బంది కి సూచించారు. **నందిగామ :** నందిగామ మండలం జొన్నలగడ్డ గ్రామంలోని రాత్రి 8 గంటల సమయంలోనే అంగన్వాడీ కేంద్రం హరిజనవాడలో ఉన్న కేంద్రాన్ని తాళాలు రాత్రి సమయంలో సచివాలయం సిబ్బంది దొంగలాగా తాళాలు పగల గొట్టారు. అధికారపార్టీ నాయకులు వాలంటీర్లు తాళం పగలగొడుతున్నవారిలో ఉన్నారు. **తిరువూరు :** అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు సిఐటియు ఆధ్వ ర్యంలో సిఐటియు ఆధ్వర్యంలో తిరువూరులో శుక్రవా రం నాలుగో రోజు కూడా కొనసాగింది. విస్సన్నపేట గంప లగూడెం ఏ కొండూరు తిరువూరు మండలాల చెందిన అంగన్వాడీ కార్యకర్తలు ఆయాల పెద్ద ఎత్తున పాల్గొని తహశీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహిం చారు. ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల తాళాలు బద్దలు కొట్టినా తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించే అంతవరకు ఉద్యమాన్ని ఆపేది లేదని స్పష్టం చేశారు. సిపిఐ పట్టణ కార్యదర్శి ఉదయ్, సుభాని బిఎస్పి నియోజకవర్గ కన్వీనర్ వందన కుమార్, నాయ కులు పి.మల్లయ్య తదితరులు మద్దతు తెలిపారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో అర్ఐ పుల్ల య్యకు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శివ నాగేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. గాజులమాలపల్లిలోని అంగన్వాడీ కేంద్రాన్ని ఐసిడిఎస్ అధికారులు శుక్రవారం రాత్రి ప్రైవేటు వ్యక్తితో శాఖ తాళాలు పగలగొట్టించారు. ఆ ప్రాంత ప్రజలు అడ్డుకున్నప్పటికీ పోలీసులు వారిని పక్కకు నెట్టి తాళం పగలగొట్టి మరొక తాళాన్ని వేశారు. సమాచారం తెలుసుకున్న జనసేన నాయకులు ప్రశ్నించారు. రాత్రి వేళల్లో వచ్చి తాళాలు పగలగొట్టడం సరైంది కాదన్నారు. రాజుపేటలో అంగన్వాడి కేంద్రం తాళాలు కూడా ఐసిడిఎస్ అధికారులు సచివాలయం సిబ్బందితో కలిసి పగలగొట్టారు. **కంచికచర్ల :** కీసర గ్రామ సచివాలయం సిబ్బంది గ్రామంలో గల మూడు అంగన్వాడీ సెంటర్లు తాళాలు పగులగొట్టి, సెంటర్లు తెరిచి వారి అధీనంలోకి తీసుకున్నారు. ఆయా సెంటర్‌ల పరిధిలో గర్భిణీలు, బాలింతలకు పోషకాహారం అందించాలని అదనపు బాధ్యతలు అప్పగించారు. **జగ్గయ్యపేట:** సమస్య పరిష్కారం చేయకుండా వైసిపి ప్రభుత్వం పలు అంగన్వాడీ స్కూల్ తాళాలు పగలగొట్టడం, బెదిరింపులు, కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం దుర్మార్గమని ఎపి అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ సిహెచ్ సుప్రజా, సిఐటియు జిల్లా గౌరవ అధ్యక్షులు డివి కష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్వాడీల ధర్నాకు వీరు మద్దతు తెలిపారు. **మైలవరం :** అంగన్వాడీల సమస్యలను పరిష్కరించకుండా వైసిపి ప్రభుత్వం అంగన్వాడీ స్కూలు తాళాలు పగలగొట్టడం బెదిరింపులకు దిగటం, కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం దుర్మార్గమని అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు గౌరవాధ్యక్షులు డివి.కష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్వాడీ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న సమయంలో భాగంగా శుక్రవారం నాలుగో రోజు స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద మోకాళ్లపై కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. తాళాలు పగలగొట్టడంపై ఎంపీడీవో లక్ష్మీ కుమార్‌ని అంగన్వాడీలు అడ్డగించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సబ్జి ఆకస్మిక మృతి పట్ల సంతాపం ప్రకటిస్తూ అన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డివి కృష్ణ మాట్లాడుతూ తాళాలు పగలగొట్టడం కాదు దమ్ముంటే అంగన్వాడి సెంటర్లను నడిపిస్తే అంగన్వాడీల కష్టం తెలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి పివి ఆంజనేయులు, మైలవరం, ఇబ్రహీంపట్నం, జి కొండూరు మండలాల సిఐటియు కార్యదర్శులు సిహెచ్ సుధాకర్, ఎం మహేష్, పాల్గొన్నారు. **ఇబ్రహీంపట్నం :** కొండపల్లి మున్సిపాలిటీ 4వ వార్డులోని కుమ్మరి వారి వీధి అంగన్వాడీ స్కూల్ తాళాలు పగుల కొట్టారు. దీంతో జనసేన నాయకురాలు సుజాత అడ్డుకొని ప్రశ్నించారు. అంగన్వాడీ టీచర్లు, ఆయాలు శాంతియుతంగా చేస్తున్న ధర్నాను ప్రభుత్వం పట్టించుకోకుండా ఇలా తాళాలు పగలగొట్టడం ఏమిటని మండిపడ్డారు. **వత్సవాయి :** కన్నెవీడు గ్రామంలో అంగన్వాడీ సెంటర్ల తాళ్ళాలు పగలగొట్టానికి వచ్చిన అధికారులను గ్రామస్తులు, టిడిపి నాయకులు అడ్డుకుని ప్రశ్నించారు.

కంచికచర్లలో..

వత్సవాయిలో..

మైలవరంలో...

నందిగామలో పోలీసులకు ఫిర్యాదు చేస్తూ

సింగ్‌నగర్‌లో..

జగ్గయ్యపేటలో

ఇబ్రహీంపట్నంలో...

విజయవాడలో...

కలెక్టరేట్‌ను ముట్టడించిన ఆశాలు

- పోలీసులు, ఆశాల మధ్య తోపులాట
- రోడ్డుపై బైటాయించిన నిరసనకారులు

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : ఆశ కార్యకర్తల సమస్యల పై ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కార చర్యలు తీసుకోవాలని లేకుంటే ఫిబ్రవరిలో ముఖ్య మంత్రి ఇంటీని ముట్టడిస్తాం ఆశ వర్కర్స్ యూనియన్ కృష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శి పి. ధనశ్రీ హెచ్చరించారు. ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆశ వర్కర్లు కష్ణాజిల్లా కలెక్టరేట్ వద్ద గురువారం ప్రారంభించిన 36 గంటల పాటు నిరసన దీక్ష శుక్రవారం కలక్టరేట్ మూట్టడి తో విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా దీక్ష శిబిరానికి సంఘీ భావం తెలిపిన సిఐ టి యు జిల్లా అద్యక్షులు చౌటుపల్లి రవి మాట్లాడుతూ కనీస వేతనం,గ్రాట్యుటీ అమలు చేయాలని న్యాయ స్థానాలు చెప్పినప్పటికీ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని మండిపడ్డారు. నిరసన దీక్ష అనంతరం జిల్లా కలక్టర్ కు వినతి పత్రం ఇచ్చేందుకు కలక్టర్ కార్యాలయానికి వెళ్లేందుకు ప్రయత్నించగా అప్పటికే ధర్నా చౌక్ వద్దకు భారీగా చేరుకున్న పోలీసులు ఆశా కార్యకర్తలను అడ్డుకున్నారు. దీంతో వారి ఇరువురు మధ్య తోపులాట చోటు చేసుకుంది. దీంతో కార్యకర్తలు బారికేడ్లను తోసుకుంటూ కలక్టరేట్ వద్దకు చేరుకున్నారు. ప్రధాన గేటు ఎదుట రోడ్‌పై బైఠాయించి ప్రభుత్వానికి, వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అ నంతరం సంఘ నాయకులకు, పోలీసులకు మధ్య జరిగిన చర్చలు సఫలం కావడంతో నిరసన కార్యక్రమం విరమించారు. ఈ ధర్నాలో ఉపాధ్యక్షురాలు కే స్వరూప రాణి, సరోజిని, చందన, లక్ష్మి,తో పాటు వందాలది మంది కార్యకర్తలు పాల్గొన్నారు. సిపిఎం,జిల్లా నాయకులు ఆర్.రఘు, పట్టణ కార్యదర్శి బూర సుబ్రహ్మణ్యం ,పట్టణ కమిటి నాయకులు ఎం డి యునస్, ఈడే.రామారావు, సంఘీ భావం తెలిపారు.

మాట్లాడుతున్న చౌటపల్లి రవి

కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న ఆశాలు

తోమాటి రంగనాథ్‌కు నివాళి

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ న్యాయవాది దివంగత తుమాటి రంగనాథ్ 34వ వర్ధంతిని అవనిగడ్డలో నిర్వహించారు. శుక్రవారం కోర్టు సెంటర్లోని ఆయన కోపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులు పేదలకు వస్త్రాలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, సీనియర్ న్యాయవాది పరుచూరి రాఘవేంద్రరావు, అవనిగడ్డ మాజీ సర్పంచ్ నలకుర్తి పథ్వీరాజు తదితరులు పాల్గొని రంగనాథకు ఘన నివాళులర్పించారు

తుపాను బాధిత కుటుంబానికి ఆర్థిక చేయూత

ప్రజాశక్తి కోడూరు : కోడూరు మండలం లింగారెడ్డి పాలెం గ్రామపంచాయతీ పరిధిలో జరుగువానిపాలెం గ్రామంలో తుఫాను ప్రభావంతో పూరిల్లు కుప్పకూలి నష్టపోయిన అప్పికట్ల లంకేశ్వరరావు కుటుంబం గురించి సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకుని స్పందించిన లెజెండ్స్ సోషల్ సర్వీసెస్ సంస్థ అధినేత పూతబోయిన అయ్యప్ప స్వామి 5000 ఆర్థిక సహాయాన్ని లెజెండ్స్ టీమ్ సభ్యుల ద్వారా ఆ కుటుంబానికి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా పూతబోయిన అయ్యప్ప స్వామి మాట్లాడుతూ తుఫాను నేపథ్యంలో ఇల్లు పడిపోయి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న అప్పికట్ల లంకేశ్వరరావు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-బంటుమిల్లి : బంటుమిల్లిప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జగన్ మోహన్ రావు ఆధ్వర్యంలో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. వైస్ ప్రిన్సిపాల్ దేవ జయరాజు మాట్లాడుతూ క్రిస్మస్ వేడుకలు ద్వారా మానవాళికి ఆనందాన్ని పంచడమే కాకుండా మనుషులతో ఎలా మెలగాలి అని నేర్చుకోవడానికి ఈ క్రిస్మస్ పండగ ఎంతగానో తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ తిమోతి, ఎంఈఓ త్రిపుర సుందరి దేవి, అధ్యాపకులు హిమాలిని దేవి, డాక్టర్ సత్య రాజేష్, విద్యార్థులు పాల్గొన్నారు

కేన్సర్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-గన్నవరం : మనిషి శరీరంలో ఎక్కడైన అసంబద్ధమైన రక్తస్రావం, పుండు, మలమూత్ర విసర్జన పద్ధతుల్లో మార్పులు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదిం చటం మంచిదని రోటరీక్లబ్ అసిస్టెంట్ గవర్నర్ పార్థసారధి అన్నారు. స్థానిక డాక్టర్ సీయల్ రాయుడు రోటరీ క్లబ్లో శుక్రవారం రోటరీ క్లబ్ ఆఫ్ గన్నవరం ఆధ్వర్యంలో మణిపాల్ హాస్పిటల్ సహకారంతో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్థసారధి మాట్లాడుతూ మహిళల్లో రొమ్ము, ఏ శరీర భాగంలోనైన గడ్డలు, గొంతు ద్వారా సరైన రీతిలో మింగలేకపోవటం వంటి లక్షణాలు కనిపిస్తే క్యాన్సర్ వ్యాధికి సాంకేతికాలుగా భావించి వైద్య నిపుణులను సంప్రదించాలని వివరించారు. 86మంది మహిళలకు స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. వారం తరువాత రిపోర్టులు వస్తాయని తెలిపారు. రోటరీ క్లబ్ ఆఫ్ గన్నవరం అధ్యక్షులు జాస్తి విజయభూషణ్కుమార్, ప్రధాన కార్యదర్శి నర్రా సీతారామారావు, రోటరీయన్లు చింతపల్లి సీతారామయ్య, టీఎస్ఆర్కె ప్రసాద్, గన్నె వెంకట్రావు, జీవి రవికుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చేనేత విభాగ జాయింట్ సెక్రటరీగా విట్టంశెట్టి

ప్రజాశకి- మచిలీపట్నం రూరల్ : రాష్ట్ర చేనేత విభాగ జాయింట్ సెక్రటరీగా మచిలీపట్నం మండలం చిన్నా పురం గ్రామానికీ చెందిన విట్టంశెట్టి వెంకయ్య (వెంకు మాస్టర్) ను నియమిస్తూ ప్రభుత్వం నుండి ఉత్తర్వులు వెలువడ్డాయి. రాష్ట్ర చేనేత విభాగ కమిటీలో 55 మందిని స్థానం కల్పించగా కష్ణా జిల్లా నుండి విట్టంశెట్టి వెంకయ్య కు నియమించడం పట్ల పలువురు ఆయన కు అభినందనలు తెలిపారు. ఆయన చిన్నాపురం లో ఉన్న శ్రీ బాల సరస్వతి వీవర్స్ సొసైటీ చైర్ పర్సన్ గా పనిచేస్తున్నారు. వైయస్సార్ పార్టీ కి చేస్తున్న సేవలను గుర్తిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహనరెడ్డి,రాష్ట్ర చేనేత విభాగ ప్రెసిడెంట్ గంజి చిరంజీవి, మాజీ మంత్రి,స్థానిక శాసన సభ్యులు పేర్ని వెంకటరామయ్య (నాని), జోనల్ ఇంచార్జి పేర్ని కష్ణ మూర్తి కి ఈ సందర్భంగా కతజ్ఞతలు తెలిపారు.చేనేత కార్మికుల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని మరిన్ని సేవలు చేసే అవకాశం కల్పించిందని వెంకయ్య తెలిపారు.

ఎపి క్రిస్టియన్ మైనార్టీ సెక్రటరీగా భక్తపాల్ నియామకం

ప్రజాశక్తి-ఘంటసాల : వైఎస్సార్సీపీ ఏపీ క్రిస్టియన్ మైనార్టీ రాష్ట్ర సెక్రటరీగా కొడాలి భక్తపాల్ నియమితులయ్యారు. వైఎస్సార్సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల కేంద్ర కార్యాలయం ప్రకటించిన ఏపీ వైఎస్సార్సీపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ విభాగ కమిటీలో రాష్ట్ర సెక్రటరీగా కష్ణాజిల్లా తరుపున ఘంటసాల, పెద్దగూడెంకు చెందిన కొడాలి భక్తపాల్ ను నియమిస్తూ జాబితా విడుదల చేశారు. తనకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి, సహకరించిన ప్రజా ప్రతినిధులకు, పార్టీ నేతలకు భక్తపాల్ కతజ్ఞతలు తెలియజేశారు. రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతానికి, క్రైస్తవుల సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానని భక్తపాల్ ఈ సందర్భంగా తెలిపారు.

ఉత్సవాలకు పైడమ్మ ఆలయం ముస్తాబు

ప్రజాశక్తి-పెడన : పట్టణ గ్రామ దేవత అయిన శ్రీ పైడమ్మ అమ్మవారి ఆలయం ఉత్సవాలకు ముస్తాబవుతుంది. ఈనెల 26వ తేదీ నుండి జనవరి 5వ తేదీ వరకు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు, కమిటీ సభ్యులు ఇప్పటికే ప్రకటించారు. 11 రోజులు పాటు జరిగే ఈ ఉత్సవాలకు రాష్ట్ర వ్యాప్తంగా భక్తులు లక్షలాది సంఖ్యలో పాల్గొంటారు. ఈ ఉత్సవాలలో అమ్మవారికి భక్తులు ధూప దీప నైవేద్యాలతో పాటు సిరి బండ్లు కడతారు. అంతేకాకుండా కోళ్లు,మేకలు, గొర్రెలను ఆలయం చుట్టూ తిప్పి మొక్కుబడులు చెల్లిస్తారు. ఇప్పటికే ఆలయ ప్రాంగణంలో ఉన్న అమ్మవారి స్థలాల్లో ఎగ్జిబిషన్లు, పూజ సామాన్లు, తినుబండారాలు షాపులను నిర్మిస్తున్నారు. ఆలయానికి రంగులు కూడా వేస్తున్నారు. ఈ 11 రోజులు పాటు జరిగే ఉత్సవాల్లో దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారులు భక్తులకుఉచిత దర్శనంతో పాటు ప్రత్యేక దర్శనం కల్పిస్తారు. అంతేకాకుండా జనవరి 12వ తేదీ శుక్రవారం దాదాపు లక్షన్నర ఉందికి పైగా అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు దేవదాయ శాఖ అధికారులు పేర్కొన్నారు. ప్రతి ఏడాదిలాగానే ఈసారి కూడా ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామని ఆలయ ఈ ఓ తిక్కి శెట్టి వీర వెంకట మోహన్ రావు పేర్కొన్నారు. ఇప్పటికే మున్సిపల్ అధికారులకు వైద్య విధాన పరిషత్, పోలీస్ లతో పాటు పలు శాఖల అధికారులకు కూడా సమిష్టిగా కషిచేసి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని కోరామన్నారు. భక్తులకు తాగునీరు, ఫలహారాలు ఏర్పాటు చేస్తున్న ఆలయ కమిటీ నిర్వాహకుల సలహాలు సూచనలు తీసుకుంటున్నామన్నారు.

నేరాల నియంత్రణకు కృషి : డిఎస్‌పి

ప్రజాశక్తి-చల్లపల్లి : నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణకు కషి చేస్తున్నట్లు అవనిగడ్డ డిఎస్పి పి.మురళీధర్ అన్నారు.శుక్రవారం ఆయన చల్లపల్లి పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీ నిమిత్తం విచ్చేశారు.ఆయనకు చల్లపల్లి సిఐ సీహెచ్.నాగప్రసాద్, చల్లపల్లి ఎస్సై సిహెచ్.చినబాబు స్వాగతం పలికారు. సిబ్బందితో కలిసి గౌరవ వందనం సమర్పించారు. స్టేషన్ ఆవరణలో డీఎస్పీ మొక్కలు నాటారు. అనంతరం స్టేషన్ ఆవరణ, పరిసరాలు, స్టేషనులో సౌకర్యాలు పరిశీలించారు. స్టేషన్ రికార్డులు తనిఖీ చేశారు. పోలీస్ శాఖ ద్వారా ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తున్నట్లు డి.ఎస్.పి తెలిపారు.

'జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం'కు దరఖాస్తులు ఆహ్వానం

- సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు షాహిద్ బాబు షేక్

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో సామాజికంగా, విద్యా పరంగా మరియు ఆర్థికంగా బలహీనమైన, వెనుకబడిన వర్గాల అభ్యర్థులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం "జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం" పథకం ద్వారా ఆర్థిక సహాయము అందించుట దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు షాహిద్ బాబు షేక్ తెలిపారు. యూపీఎస్ సి నిర్వహించే ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షల్లో అర్హత సాధించిన అర్హులైన అభ్యర్థులకు ప్రోత్సాహకంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ ఆర్థిక సహాయం అందించుట జరుగుతుందన్నారు. కావున ప్రిలిమినరీ పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు రూ. 50,వేలు ఆర్థిక సహాయం రాష్ట్ర ప్రభుత్వం అందించుట జరుగుతుందన్నారు. ఇందుకు గాను 2023 లో యు పి ఎస్ సి ,నిర్వహించిన మెయిన్స్ పరీక్షల్లో అర్హత సాధించిన మరియు ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 19 వ తేదీ లోపు జ్ఞానభూమి పోర్టల్లో jnanabhumi.ap.gov.in వెబ్ సైట్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మోటూరు రామాలయం ఇఒగా నాగమౌనిక

ప్రజాశక్తి, గుడివాడ రూరల్: గుడివాడ మండలం మోటూరు గ్రామంలో వేంచేసి యున్న శ్రీ సీతారామస్వామి దేవాలయం ఈవోగా గొరిపర్తి నాగ మౌనిక నియమితులైయ్యారు. ఆమె షణ్ముగం నుంచి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె గతంలో సింగినగర్ సచివాలయంలో విధులు నిర్వహించి ఎపిపిఎస్సి గ్రేడ్-3లో విజయం సాధించి ఈవోగా బాధ్యతలు చేపట్టారు. రామాలయంతో పాటు మోటూరులోని శ్రీ నాగేశ్వర స్వామి దేవస్థానం, పెదఎరుకపాడులోని శివాలయం, సీపూడిలోని రామాలయం ఈవోగా విధులు నిర్వహిస్తారు. స్వామి వారి కృపతో దేవాలయాలను అభివృద్ధి చేస్తానని నాగమౌనిక తెలిపారు.

టిడిపి-జనసేన నాయకుల సమావేశం

ప్రజాశక్తి-పమిడి ముక్కల : నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని పేదల సంక్షేమం కోసం స్థాపించారని పామర్రు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ వర్ల కుమార్ రాజా అన్నారు. శుక్రవారం పమిడిముక్కలలోని ఆర్యవైశ్య కళ్యాణమండపంలో తెలుగుదేశం పార్టీ జనసేన పార్టీ విస్తతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు పేదల సంక్షేమం కోసం కార్యక్రమాలు చేశారని అన్నారు. ఈ సమావేశానికి పమిడిముక్కల, పామర్రు, పెదపారుపూడి, మొవ్వ మండలాల నుండి విస్తతంగా కార్యకర్తలు తరలి వచ్చారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాజులపాటి శ్రీనివాసరావు, జనసేన నాయకులు తాడిచెట్టు నరేష్, సుమన్, సన్నకా కిరణ్ తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వర్ల కుమార్ రాజా

క్యూలైను పనులు ప్రారంభం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రి దుర్గమ్మ దేవాలయం ఆధ్వర్యంలో 2024 జనవరి 3వ తేదీ నుండి 7 వరకు జరుగు భవానీ దీక్షా విరమణలు సందర్భంగా ప్రతి సంవత్సరం వలె వినాయక స్వామి వారి దేవస్థానం వద్ద నుండి ప్రారంభమగు క్యూ లైన్ పనులను శుక్రవారం ఉదయం పూజలు నిర్వహించి క్యూ లైన్ పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ కర్నాటి రాంబాబు, ఆలయ కార్యనిర్వాహణాధికారి కె.ఎస్. రామరావు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొని కొబ్బరి కాయలు కొట్టి దసరా క్యూ లైన్ పనులు ప్రారంభించారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మ ఆలయము నందు ప్రతిరోజూ జరిగే నిత్య అన్నదానం పథకానికి సరోజినీ దేవి రోడ్, సికింద్రాబాద్‌కు చెందిన రాణి కన్స్ట్రక్షన్స్ ప్రై.లిమిటెడ్‌కు చెందిన గుండయ్య గల్లా రూ. లక్ష చెక్కును ఆలయ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ కర్నాటి రాంబాబు, కార్యనిర్వాహణాధికారి కెఎస్ రామరావు చేతుల మీదుగా శుక్రవారం దేవస్థానానికి విరాళంగా అందజేశారు.

ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - గంపలగూడెం : బైక్ ప్రమాదంలో రెండు చోట్ల కాలు విరిగిన బాధితుడికి రూ.5వేలు సహాయం అందించినట్లు కొత్తపల్లి గ్రామ టిడిపి నాయకుడు గువ్వల వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన ఉద్దగిరి వెంకటకృష్ణ ఇటీవల బైక్‌పై ప్రయాణిస్తున్న నేపథ్యంలో ప్రమాదం జరిగి కాలు విరిగింది. బాధితుడికి తిరువూరు అమరావతి ఆస్పత్రిలో వైయస్సార్ ఆరోగ్యశ్రీలో శస్త్రచికిత్స జరిగింది. విజయవాడ కేశినేని చిన్ని ట్రస్టు ద్వారా రూ.5 వేలు శుక్రవారం సాయంగా అందజేశారు. కార్యక్రమంలో పెద్దకొమెర పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు వేముల బాలయ్య ఉన్నారు.

ఆక్మతి షాపింగ్ మాల్ ప్రారంభం

ప్రజాశక్తి - విస్సన్నపేట : మండలం కేంద్రంలో ఆక్మతి షాపింగ్ మాల్‌ని శుక్రవారం తిరువూరు ఎంఎల్ఎ కొక్కిలిగడ్డ రక్షణనిధి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తిరువూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, మండలం జడ్‌పిటిసి సభ్యులు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, ఎంపిపి పిల్లి మెర్సీ వనజాక్షి -రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ, అవగాహన కలిగి, తూచా తప్పకుండా పాటించాలని విజయవాడ మానవ హక్కుల సంఘం అధ్యక్షులు డా. అక్బర్ బాషా తెలిపారు. విద్యాధరపురంలోని బెజవాడ రాజారావు హైస్కూల్లో శుక్రవారం రోడ్డు భద్రత - ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న విజయవాడ మానవ హక్కుల సంఘం అధ్యక్షులు డా. అక్బర్ భాషా మాట్లాడుతూ రోడ్డు మీద ఎలా నడవాలో, ఎటువైపు నడవాలి అనే అంశాలను వివరించారు. రోడ్డు దాటేటప్పుడు జీబ్రా క్రాసింగ్ గుర్తులు చూసుకుని దాని మీదుగా రోడ్డు దాటాలని విద్యార్థులకు వివరించారు. తప్పకుండా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీయేట్ చెందిన సుధాకర్, పాఠశాల కరస్పాండెంట్ బెజవాడ రాజారావు, సెక్రటరీ శ్యామ్ ప్రకాష్, ప్రిన్సిపాల్ కె.ఎల్. ప్రసన్న, సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - నందిగామ : ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఎన్టీఆర్ జిల్లా ప్రథమ మహా సభలను జయ ప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కన్వీనర్ మల్నీడి యలమందా రావు, కో కన్వీనర్ చుండూరు వెంకట సుబ్బారావు కోరారు. ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రథమ మహాసభలను డిసెంబరు 21న నిర్వహించనున్న మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. శుక్రవారం నందిగామ సిపిఐ కార్యాలయం చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో నుండు జిల్లా ప్రథమ మహాసభల కరపత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర బాబు, ఏఐయస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పుటూరి అరుణ్ కుమార్, సీపీఐ మండల కార్యదర్శి మన్నే హనుమనురావు, పట్టణ కార్యదర్శి వేముల వీరయ్య, రైతుసంఘం నాయకులు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకింగ్ వ్యవస్థపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - వన్‌టౌన్ : జాతీయ బ్యాంకింగ్ రంగంలో ఎస్‌బిఐ ప్రత్యేకస్థానం ఆక్రమించిందని, వయో తారతమ్యం లేకుండా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) సేవలు అందరూ వినియోగించుకోవాలని వాగు సెంటర్ ఎస్‌బిఐ బ్రాంచి మేనేజర్ కలపాల ప్రేమ్‌చంద్ కోరారు. శుక్రవారం సాయంత్రం బ్యాంకులో సెయింట్ థామస్ ఇంగ్లీషు మీడియం హైస్కూలు విద్యార్థులకు బ్యాంకింగ్ వ్యవస్థ పనితీరుపై అవగాహన సదస్సు నిర్వహించారు. మారుతున్న కాలానుగుణంగా బ్యాంకులు వినియోగదారుల శ్రేయస్సు కోసం, వారికి అందుబాటులో ఉండేలా సరళమైన మార్పులు చేర్పులు చేశామన్నారు. ముఖ్యంగా నేటి విద్యార్థులకు బ్యాంకులో ఖాతాలుండడం తప్పనిసరి అయిందన్నారు. ""కరెంట్ ఎకౌంట్, "జీరో" బ్యాలెన్స్ ఎకౌంటు తేడాలు వివరించారు. అలాగే చెక్కు బుక్ అంటే ఏమిటో... దానివల్ల ఉపయోగాలు ఏమిటో వివరించారు. 50 మంది విద్యార్థిని విద్యార్థులకు "0" బ్యాలెన్స్ బ్యాంకు ఖాతాలు ఓపెనింగ్ దరఖాస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బి ఎమ్ కలపాల ప్రేమ్‌చంద్‌తో పాటుగా సర్వీస్ మేనేజర్ శేషం శ్రీనివాస్, క్యాష్ ఇంచార్జి టి. మెహర్ కుమార్, సీనియర్ అసోషియేట్ తలారి పవన్, బ్యాంకు సిబ్బంది, సెయింట్ థామస్ ఇంగ్లీషు మీడియం హైస్కూలు అధినేత లయన్ డాక్టరు రాజు దేవిడ్, బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌బిఐ మేనేజర్ ప్రేమ్‌చంద్

36 గంటల వంటా - వార్పు విజయవంతం

చలి, దోమలను సైతం లెక్క చేయక ధర్నావద్దే నిద్రించిన ఆశా వర్కర్లు

ప్రజాశక్తి - విజయవాడ : ఆశా వర్కర్ల 36 గంటల మహాధర్నా, వంటా-వార్పు కార్యక్రమం విజయవంతమైంది. గురువారం ఉదయం 10 గంటలకు ధర్నాచౌక్‌లో ప్రారంభమైన ఈ మహాధర్నా కార్యక్రమం శుక్రవారం మధ్యాహ్నం ముగిసింది. ఈ ధర్నా రిహార్సల్స్ మాత్రమేనని, తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుంటే ఉద్యమాన్ని వివిధ రూపాల్లో ఉధృతం చేయడంతో పాటు అవసరమైతే సిఎం క్యాంప్ ఆఫీసు ముట్టడికైనా వెనుకాడేది లేదని హెచ్చరిస్తూ ఆశా వర్కర్లు వారి ఆందోళనను విరమించారు. యూనియన్ నేతలతో చర్చించి, న్యాయమైన తమ డిమాండ్లను పరిష్కరించకుంటే రాబోయే ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి తమ శక్తి ఏమిటో నిరూపిస్తామంటూ ఆశా వర్కర్లు ఈ సందర్భంగా శబథం చేశారు. పైన మబ్బులు, వణుకు పుట్టించే చలి, దోమలను సైతం లెక్క చేయకుండా ఆశా వర్కర్లు టెంట్ కిందనే రాత్రి ధర్నా చౌక్‌లోనే నిద్రించి, డిమాండ్ల సాధన కోసం వారి పోరాట స్పూర్తిని నిరూపించారు.

ఎవి నాగేశ్వరరావు

ఆశా వర్కర్ల 36 గంటల మహాధర్నా ప్రారంభం మాత్రమేనని, ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు హెచ్చరించారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల విధానాల కారణంగా వేతనాల కంటే ధరలు విపరీతంగా పెరిగాయని, ఇటువంటి పరిస్థితుల్లో సుప్రీంకోర్టు తీరుకనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. సిఐటియు రాష్ట్ర నాయకులు చిగురుపాటి బాబూరావు ధర్నాకు సంపూర్ణ మద్దతునిచ్చి మాట్లాడుతూ ఆశా, అంగన్‌వాడీల సమస్యల పట్ల స్పందించకుంటే రానున్న కాలంలో ప్రభుత్వ పీఠాలు కదులుతాయని హెచ్చరించారు. ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి మాట్లాడుతూ రూ.పది

మాట్లాడుతున్న ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి

వేలు ఇస్తున్నామనే పేరుతో 24 గంటలు చాకిరీ చేయిస్తున్నారని అన్నారు. ఎన్‌హెచ్ఎం నిబంధనలకు భిన్నంగా వ్యవహరిస్తూ, ఆశాలను తీవ్రమైన మానసిక వత్తిడికి ప్రభుత్వం గురి చేస్తుందని, ఈ వత్తిడి తట్టుకోలేక ఇటీవల కాలంలో గుండెపోటుతో అనేక మంది అకాలమరణానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసుశాఖ మాజీ జాయింట్ డైరెక్టర్ (జెడి) లక్ష్మీనారాయణ ఆశాల ఆందోళనకు సంపూర్ణ మద్దతునిచ్చి మాట్లాడారు. ఆశాల ఉద్యమం చాలా న్యాయసమ్మతమైనదని అన్నారు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి పి నరసింహారావు, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ కమల, సిఐటియు పశ్చిమ సిటీ కార్యదర్శి, సిపిఎం కార్పొరేటర్ బోయి సత్యబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వి వెంకటేశ్వరరావు, పెన్షనర్ల సంఘం నాయకులు ఎంఎస్‌పాత్రుడు, పాల్గొన్నారు. ధర్నా ముగింపు దశలో ఆశాల సమస్యల ఇతి వృత్తంగా ఆశా వర్కర్లు ప్రదర్శించిన నాటిక విశేషంగా ఆలోచింప చేసింది. దీనిలో పిఎన్ఎం జిల్లా కార్యదర్శి ఎన్ అప్పన్న, పాల్గొన్నారు.

యువగళం ముగింపు సభను జయప్రదం చేయాలి : బేగ్

ప్రజాశక్తి - వన్‌టౌన్ : యువగళం ముగింపు సభని జయప్రదం చేయాలని తెలుగుదేశం పశ్చిమ నాయకులు ఎం.ఎస్.బేగ్ పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. శుక్రవారం రాష్ట్ర తెలుగుదేశంపార్టీ పిలుపు మేరకు ఈ నెల 20వ తేదీన నెల్లిమర్ల నియోజకవర్గం భోగాపురం మండలం పోలేపల్లిలో యువగళం ఎన్నికల శంఖారావం సభ ఉన్నందున విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శ్రీనివాస్ ఆదేశాల మేరకు బేగ్ సారథ్యంలో టీమ్ టీడీపీ ఆధ్వర్యంలో పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు..ఈ కార్యక్రమంలో బేగ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో భవిష్యత్తు గ్యారంటీ రిజిస్ట్రేషన్లు, ఎలక్షన్ ప్రాసెస్ వేగవంతంగా పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షులు రాజు సోలంకి, జిల్లా కార్యాలయ కార్యదర్శి సారిపల్లి రాధాకృష్ణ, జిల్లా అధికార ప్రతినిధి బెవర సాయి సుధాకర్, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు ఎర్ర రామారావు, పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - భవానీపురం : స్థానిక 45వ డివిజన్‌లోని రాము క్వారీలో రూ. 10 లక్షల వ్యయంతో సిమెంట్ రోడ్డు, కాలువల నిర్మాణం ప్రారంభించినట్లు 45వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు మాధురి లావణ్య చెప్పారు. శుక్రవారం రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన మాధురి లావణ్య మాట్లాడుతూ ఇక్కడ స్థానికులు పడుతున్న ఇబ్బందుల పరిష్కారం కోసం సిమెంట్ రోడ్డు కాలువలు మెట్లు నిర్మాణానికి చర్యలు తీసుకున్నట్లు వివరించారు. పశ్చిమ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు మార్గదర్శకత్వంలో డివిజన్ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ముత్తా వాసు, ఆర్. కోటేశ్వరి, స్థానికులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు వర్ధంతి

విజయవాడ : సత్యనారాయణపురంలోని చిత్త రంజన్ గ్రేడ్-2 శాఖ గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి పి. సంపత్ కుమార్ శ్రీరాములు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమం లో సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. గవర్నర్ పేట రాఘవ స్మారక గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి నిర్వహించారు. గ్రంథాలయ చైర్పర్సన్ పూర్ణమ్మ గ్రంథాలయ సంస్థ యుడిసి బి.విజయ కుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాఠకులు, కార్యాలయ జెఎరామారావు, తదితరులు పాల్గొన్నారు.

చిత్తరంజన్ గ్రంథాలయంలో నివాళి

ప్రజాస్వామ్యంలో ఎన్నికల సంఘం పాత్ర గణనీయం

జగ్గయ్యపేట: ప్రజాస్వామ్యంలో ఎన్నికల సంఘం పాత్ర గణనీయమైందని, ప్రజాస్వామ్యం మూలాలను దెబ్బతీసేలాగా రాజ్యసభలో ఆమోదం పొందిన చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఇతర కమిషనర్ల అపాయింట్‌మెంట్ బిల్ 2023 ఉందని ఎన్నికల నిఘా వేదిక రాష్ట్ర కన్వీనర్, సామాజికవేత్త కర్లపాటి వెంకట శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్ట్ సూచనలను పరిగణలోకి తీసుకోకుండా బిల్లును ఆమోదించటం దురదృష్టకరమని ఆయన అన్నారు.

కౌన్సిలర్ చొరవతో వీధిలైట్లు

జగ్గయ్యపేట: పట్టణంలోని మినీ బైపాస్ రోడ్డులో 10వ వార్డు పరిధిలో పార్కు దగ్గర కాలువ నిర్మాణ పనులు జరుగుతుండటం, ఇటీవల కురిసిన వర్షానికి రెండు కరెంటు స్తంభాలు విరిగి కింద పడటంతో బైపాస్ రోడ్‌లో చెరువు పక్కన ఉన్న లైట్లు వారంరోజుల నుంచి వెలగడం లేదు. దీనితో విషయాన్ని పదో వార్డ్ కౌన్సిలర్ కన్నెకంటబోయిన రామలక్ష్మికి తెలిపారు. బైపాస్ రోడ్డు వెంబడి ఉన్న ఇళ్లల్లో నివసించే ప్రజలకు, చిన్న పిల్లలకు ముఖ్యంగా జేఆర్సీ కాలేజ్ నుండి రాత్రి ఇంటికి వెళ్లే ఆడపిల్లలకు భయంకరమైన చీకటికావటం, చెరువు పక్క ప్రాంతం కావడం వల్ల ప్రజలు, బాటసారులకు చాలా ఇబ్బంది కరంగా ఉంటుందని స్వయంగా ఆ ప్రాంతానికి కౌన్సిలర్ రామలక్ష్మి వెళ్లి పరిశీలించి అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో శుక్రవారం కొత్త లైట్లు దగ్గరుండి ఇల్ల ప్రక్కన ఉన్న మెయిన్ లైన్ స్తంభాలకు కొత్త లైట్లు వేయించారు. రామలక్ష్మిని వార్డు ప్రజలు అభినందిస్తున్నారు.

ట్రాన్స్‌కో అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : విద్యుత్ పొదుపు వారోత్సవాల్లో భాగంగా విజయవాడ రూరల్ డివిజన్ ఆధ్వర్యంలో విద్యుత్ పొదుపుపై అవగాహన ర్యాలీని శుక్రవారం ఇబ్రహీం పట్నంలో నిర్వహించారు. ట్రాన్స్‌కో కార్యాల యం నుంచి రింగ్ సెంటర్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జి. బి శ్రీనివాస్ ఎక్జిక్యూటివ్ ఇంజనీరింగ్, వై.కొండలరావు ఏడీఈ, ఉద్యోగులు పాల్గొన్నారు.

మోడల్ టెస్ట్ పేపర్ పంపిణీ

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల మండలం గండేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చదివే 75 మంది విద్యార్థులకు దాతల సహకారంతో మోడల్ టెస్ట్ పేపర్ బుక్స్ శుక్రవారం పంపిణీ చేశారు. యుటిఫ్ జిల్లా కార్యదర్శి రెడ్ స్టార్, ఇబ్రహీంపట్నం మండలం నాయకులు జి అమర్ నాథ్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ మాజీ మేనేజర్ యస్ యస్ అప్పారావు ఆధ్వర్యంలో రూ.7 వేల విలువ గల పదో తరగతి మోడల్ టెస్ట్ పేపర్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సిహెచ్ రామకృష్ణ, యుటిఎఫ్ మండల కార్యదర్శి మేరుగ రామారావు, నాయకులు పి.కుమార స్వామి, తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాల్లో పనుల పరిశీలన

జగ్గయ్యపేట: టిడ్కో గృహాల్లో జరుగుతున్న డ్రైనేజి, ఫ్లోరింగ్, వాటర్ సప్లయ్ లైన్, విద్యుత్ మొదలగు పనులను శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ రంగాపురం రాఘవేంద్ర పర్యవేక్షించి నట్లు తెలిపారు. టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు అవసరమైన మౌళిక సదుపాయాలు అన్ని సమకూర్చి అతి త్వరలోనే లబ్ధిదారులకు అంది స్తామని తెలిపారు. అక్కడి పనులను పర్య వేక్షించి సంబంధిత కాంట్రాక్ట్ ర్లకు పనులు వేగ వంతం చేయవలసినదిగా ఆదేశాలు జారీ చేసి నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర రావు,కో ఆప్షన్ సభ్యులు చైతన్య శర్మమార్కెట్ యార్డ్ చైర్మన్ మానేపల్లి బ్రహ్మం, వైసిపి పాల్గొన్నారు.

అంగన్‌వాడీల నిరసన ప్రదర్శనలు

- అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగులగొట్టడంపై ఆగ్రహం
- సమ్మెకు పలు పార్టీ నాయకుల మద్దతు

కంకిపాడులో మాట్లాడుతున్న వై.వెంకటేశ్వరరావు

సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె శుక్రవారానికి నాలుగో రోజుకు చేరింది. జిల్లాలోని పలుచోట్ల అంగన్‌వాడీ కేంద్రాల తాళాలను సచివాలయం సిబ్బంది చేత పగులగొట్టించి తెరిచారు. గన్నవరంలో అంగన్‌వాడీలు నిర్వహించిన ప్రదర్శనలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వ రరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-గన్నవరం : అంగన్వాడీల సమస్యల పరిష్కారంలో జగన్ మాట మార్చారు.. మడమ తిప్పారు. ఎన్నికల హామీల అమలును కాలరాశారు.. మోసపూరిత మాటలతోనే ఈ నాలుగున్నరేళ్లు నెట్టుకొచ్చారు.. ఇంతవరకు న్యాయమైన డిమాండ్లు ఒక్కటీ పరిష్కరించలేదు.. ఇది నిజం కాదా సీఎం జగన్ చెప్పాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు సవాల్ విసిరారు. అంగన్వాడీలు తమ సమస్యల పరిష్కారం కోసం గత నాలుగు రోజులుగా చేస్తున్న ఉద్యమానికి సంఘీభావంగా గన్నవరంలో శుక్రవారం సిపిఎం ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శన జాతీయ రహదారి మీదుగా పేటల్లోనూ, బుద్ధవరం రోడ్డులోనూ సాగింది. అనంతరం ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ఆందోళనలో చేపట్టిన అంగన్వాడీల వద్దకు వెళ్లి మద్దతు తెలిపారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ....వేతనం తక్కువ ఇచ్చి పనిభారం ఎక్కువ వేశారన్నారు. అప్పులుచేసి అంగన్వాడి కేంద్రాలను నిర్వహించాల్సిన పరిస్థితి కార్యకర్తలకు వచ్చిందన్నారు. వీరి శ్రమను గుర్తించడం లేదని చిన్నచూపు చూస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వంతో ఇక తాడోపేడో తేల్చుకోవడానికి సిద్ధమయ్యారని,మీ పోరాటానికి సిపిఎం పూర్తి మద్దతు ఇస్తుందని చెప్పారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వై. నరసింహారావు మాట్లాడుతూ.. డిమాండ్ల పరిష్కారంలో ప్రభుత్వం నిర్దయగా వ్యవహరించిందని, ప్రభుత్వంతో చర్చలు విఫలమై విధిలేని పరిస్థితుల్లో నిరవధిక సమ్మెలోకి వెళ్లిన వారితో కయ్యానికి సిద్ధమైందన్నారు. ఎంతకూ లొంగకపోవడంతో అంగన్వాడీ కేంద్రాలను స్వాధీనం చేసుకోవాలని, ఉన్నతాధికారులు సచివాలయాల సిబ్బందిని ఆదేశించడంతో ఘర్షణ వాతావరణం నెలకొందన్నారు. సచివాలయ సిబ్బంది, కార్యకర్తలకు ఫోన్చేసి కేంద్రాల తాళాలు ఇవ్వాలని లేకపోతే పగలకొట్టి స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించటం సరికా దన్నారు. ప్రభుత్వం ఇంకా మొండిగా వ్యవహరిస్తే ఉద్యమం మరింత ఉధతం అవుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కే.వెంకటేశ్వరరావు, టీవీ లక్ష్మణస్వామి, బేతా శ్రీనివాసరావు, మల్లంపల్లి ఆంజనేయులు, అజ్మీర వెంకటేశ్వరరావు, కడవకొల్లు రామరాజు, కైలే ఏసుదాసు, బెజవాడ తాతబ్బాయి, మరియదాసు, బుద్ధవరం సర్పంచ్ బడుగు బాలమ్మ, తదితరులు పాల్గొన్నారు.**ప్రజాశక్తి-కంకిపాడు :** కంకిపాడులో అంగన్‌వాడీలకు మద్దతుగా సిపిఎం రాష్ట్రా కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరావు మద్దతు తెలిపి మాట్లాడారు. అంగన్వాడి వారికి కనీస వేతనాలు సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా 26,000 ఇవ్వాలని, గ్రాట్యూటీ చెల్లించాలని, పెన్షన్ తో కూడిన రిటైర్మెంట్ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమ్మెలో ఉన్న కార్మికులతో చర్చలు జరపకుండా అంగన్వాడి సెంటర్ లో తాళాలు పగలగొట్టడం వాలంటీర్లతో పని చేయించడం చట్ట వ్యతిరేకమన్నారు. పెనమలూరు నియోజకవర్గం జనసేన సమన్వయకర్త ముప్పా రాజా, జనసేన పెనమలూరు నియోజకవర్గం నాయకులలు విరన్, కౌలు రైతుల సంఘం కష్ణా జిల్లా అధ్యక్షుడు కే శివ నాగేంద్రం పి రంగారావులు సమ్మెకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు అమరయాశాస్త్రి, పెనమలూరు నియోజకవర్గ తెలుగు రైతు సంఘం అధ్యక్షుడు కాకాని శ్రీనివాసరావు, రైతు సంఘ నాయకులు చిక్క వరపు శ్రీహరి, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఉప్పాడ త్రిమూర్తులు, తాడంకి నరేష్, సజ్జ బలగంగాధర్, బి రాజేష్‌లు మద్దతు తెలిపారు. సిపిఎం పెనమలూరు, కంకిపాడు ఉయ్యూరు, కమిటీల ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్ నుంచి ర్యాలీగా వెళ్లి సమ్మెకు సంఘీభావం తెలిపారు. మూడు మండలాల పార్టీ సభ్యులు, ప్రజానాట్యమండలి కష్ణాజిల్లా అధ్యక్ష కార్యదర్శులు కే కొండల బాబు ఎస్కె కాసిం,అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కార్యకర్తలతో పెట్టుకుంటే ప్రభుత్వాలే కూలిపోతాయి

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, ఆర్ రఘు

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : ఇచ్చిన వాగ్ధానాలు అమలు చేయాలని శాంతి యుతంగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడటం ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నియంతత్వ పోకడలకు నిదర్శనం అని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్. రఘు అన్నారు. అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం 26 వేలు, గ్రాడ్యుటీ అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ 5 లక్షలు ఇవ్వాలని, సగం పెన్షన్ గా ఇవ్వాలని, తదితర డిమాండ్లతో గత నాలుగు రోజులుగా శాంతి యుతంగా నిరవదిక సమ్మె చేస్తుంటే చర్చల ప్రక్రియ జరపకుండా వైసిపి ప్రభుత్వం అంగన్వాడీ వర్కర్స్ పై కక్ష సాధింపు చర్యలు దిగటం సిగ్గు చేటన్నారు. పైగా అంగన్వాడీ స్కూల్ తాళాలు పగలగొట్టడం అంటే జగన్ మోహన్ రెడ్డి నియంతత్వ,నిరంకుశ పాలనకు నిదర్సనం అని దుయ్యపట్టారు. అంగన్ వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ రమాదేవి మాట్లాడుతూ ప్రభుత్వ బెదిరింపులకు భయపడేది లేదన్నారు. సమ్మెకు సంఘీభావంగా సిపిఎం ఆధ్వర్యంలో చిలకలపూడి సెంటర్ గాంధీ విగ్రహం వద్ద నుండి ర్యాలీ నిర్వహించారు. సిపిఎం.పట్టణ కార్యదర్శి బూర. సుబ్రహ్మణ్యం ,సి ఐ టి యు జిల్లా అధ్యక్షులు చౌటుపల్లి రవి, తదితరులు సంఘీభావం తెలిపిన ఈ సమ్మె కార్యక్రమంలో మచిలీపట్నం ప్రాజెక్టు ఆధ్యక్ష ,కార్యదర్శులు సి హెచ్ నాంచారమ్మ . పి.రెజీనా రాణి మరియు. లక్ష్మి, అంజలి, విజయశ్రీ, సీతారత్నం, రత్నకుమారి, సుజాత, సౌజన్య, స్వర్ణ లతతో పాటు వందలాది మంది అంగన్ వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్వాడి కార్యకర్తల ఇళ్లకు నోటీసులు జారీ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని అంగన్వాడి కేంద్రాల భవనాల తాళాలు పగలగొట్టి నిర్వహణ శుక్రవారం చేపట్టారు. మండలంలోని పలు గ్రామాల్లో ఎంపీడీవో, పంచాయతీ, రెవిన్యూ, సచివాల సిబ్బంది ప్రతి అంగనవాడి కేంద్రానికి వెళ్లి తాళాలు పగలగొట్టి వాలంటీర్లు, సచివాల సిబ్బంది ద్వారా అంగన్వాడి పిల్లలను తీసుకువచ్చారు. వారికి పాఠశాలలో వండే ఆహారాన్ని అందజేశారు. అయితే రెవెన్యూ అధికారులు అంగన్వాడి కార్యకర్తలు ఇళ్ల తలుపుల మీద నోటీసుల అందజేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం పోరాడుతుంటే ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడటం అన్యాయమని అంగన్వాడి కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దారపు శ్రీనివాస్, స్థానిక పంచాయతీ కార్యదర్శి ఏ జె యల్ నరసింహారావు, వీఆర్వో ప్రకాష్, ఐసిడిఎస్ సూపర్వైజర్ వాణి పాల్గొన్నారు. **ప్రజాశక్తి-బంటుమిల్లి :** బంటుమిల్లి మండలంలో అంగన్వాడి టీచర్లు ఆయాలు తహసీల్దార్ కార్యాలయానికి ప్రదర్శనగా వెళ్లి తహసీల్దార్‌కు మోరల సత్యనారాయణకు వినతిపత్రం అందించారు. ఈ ధర్నాకి సంఘీభావంగా సిపిఎం పార్టీ జిల్లా సెక్రెటరీ సభ్యురాలు జ్యోతి హాజరై ప్రసంగించారు. జనసేన పార్టీ నాయకులు అలాగే ఉరివే సర్పంచి సమ్మెకు మద్దతు తెలియజేశారు. అంగన్‌వాడీల ప్రదర్శనలో సిపిఎం నాయకులు లంకదాసుల అజయ్ ఘోష్, పెడన సిఐటియు నాయకులు పంచిన నరసింహారావు, సిపిఎం నాయకులు పేరిశెట్టి విశ్వనాథ్, బొడ్డు నాగరాజు, పొదిలి వెంకన్న, వంగలి రాజు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కోడూరు :** కోడూరు మండలం మాచవరం గ్రామంలో అంగన్వాడి కేంద్రం తాళాలు బద్దలు కొట్టారు. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగాలు ద్వారా అంగన్వాడి కేంద్రాలు నడిపిస్తామని తహసిల్దార్ లతీఫ్ బాషా తెలిపారు. పిల్లలను ఇంటింటికి వెళ్లి తీసుకువచ్చి వారికి భోజన ఏర్పాట్లు చేస్తున్నట్లు తాసిల్దార్ తెలిపారు.**ప్రజాశక్తి, గుడివాడ రూరల్:** అంగన్‌వాడిల న్యాయమైన కోర్కెల పరిష్కార దిశగా ప్రభుత్వం దిగి రావాలని సీపీఎం పార్టీ కృష్ణాజిల్లా కార్యదర్శి వి.జ్యోతి పేర్కొన్నారు. సీపీఎం పార్టీ గుడివాడ నియోజకవర్గ నాయకులు సిపిఎం పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా నినాదాలు చేసుకుంటూ ఐసీడీఎస్ కార్యాలయానికి చేరుకుని వారికి మద్దతు పలికారు. సిపిఎం గుడివాడ కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి, సిపిఎం పార్టీ పట్టణ కమిటీ సభ్యులు పి.రజని, టి.లక్ష్మణరావు, బి.వెంకటేశ్వరరావు, ఆర్.కొండ, బి.అరుణ, వెంకటేశ్వరరావు, ఏషయ్య, ప్రభుదాసు, నారాయణ, ఏసుపాదం, గుడ్లవల్లేరు కార్యదర్శి బివి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. **పామర్రు :** అంగన్వాడీల సమ్మెకు మద్దతుగా పామర్రు నియోజకవర్గంలోని అన్ని మండలాల సిపిఎం సభ్యులు ఎన్టీఆర్ సర్కిల్ వద్ద నిరసన చేపట్టి అంగన్వాడీలు చేస్తున్న సమ్మెకు తమపూర్తి మద్దతు తెలియజేశారు. అంగన్వాడీ సెంటర్ల తాళాలు పగల గొట్టడంపై తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసనవ్యక్తం చేసి తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. సిపిఎం పార్టీ నాయకులు ఎం. విల్సన్. కే నాగభూషణం. కే శివ నాగేంద్ర.రామాంజనేయ ప్రసాద్. సిఐటియు నాయకులు ఓ గంగాధర్. ఐ రాజు.ఎం శ్రీనివాస్. తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ :** అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు నల్ల దుస్తులు ధరించి నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తూనే కార్యక్రమానికి బందరు మాజీ పార్లమెంట్ సభ్యులు టిడిపి జిల్లా అధ్యక్షులు కొనకళ్ళ నారాయణరావు ఆధ్వర్యంలో తెలుగుదేశం జనసేన పార్టీల నాయకులు సమ్మె శిబిరం వద్దకు వచ్చి సమ్మెకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా అంగన్వాడీ యూనియన్ జిల్లా నాయకులు నిర్మల జ్యోతి మాట్లాడారు. అనంతరం అంగన్వాడీ కార్యకర్తలతో కలిసి తాసిల్దార్ కార్యాలయానికి వెళ్లి తాసిల్దార్ ఎల్ వి రామకష్ణ కు వినతి పత్రం అందజేశారు. కాగా అంగన్వాడీ కార్యకర్తలను బొబ్బిలి ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా సిపిఎం పార్టీ నాయకులు బండి ఆదిశేషు, ధోనే సహదేవుడు, శ్రీనివాసరావు, పాలపర్చిన మోహన్రావు, కోపనాతి తాతయ్య ఆధ్వర్యంలో ఎంఎల్ఎ దిష్టిబొమ్మను దగ్ధం చేసేందుకు ర్యాలీగా వెళుతుండగా మధ్యలో పోలీసులు అడ్డుకొని దిష్టిబొమ్మ దగ్ధాన్ని నివారించారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు గాదె సుశీల, ఏ నాగమణి , కే పాములమ్మ, మోపిదేవి ఎంపీపీ రావి దుర్గావాణి, చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కష్ణకుమారి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మాసవరపు ఆదినారాయణ, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి హనుమాన్‌జంక్షన్ :** బాపులపాడు మండలంలోని బండారుగూడెం, అంపాపురం, కోడూరుపాడు, కొత్తపల్లి, తదితర గ్రామాల్లోని ఆంగన్వాడీ కేంద్రాల తాళాలను సచివాలయ సిబ్బంది వీడియో తీస్తూ వగలగొట్టారు. **ప్రజాశక్తి-మోపిదేవి :** మోపిదేవి మండలం పెదప్రోలు గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం తాళాలను అధికారులు పగులగొడుతుండగా మోపిదేవి మండల జనసేన పార్టీ నాయకులు అడ్డుకున్నారు. **ప్రజాశక్తి, గుడివాడరూరల్:** గుడివాడ మండలంలోని 45 అంగన్‌వాడి కేంద్రాలు శుక్రవారం నుంచి పని చేస్తున్నట్లు ఐసిడియస్ సూపర్‌వైజర్‌లు అరుణకుమారి, నాగశిరిష తెలిపారు. నాలుగు రోజుల నుంచి అంగన్‌వాడిలు తమ డిమాండ్ల పరిష్కారం నిమిత్తం సమ్మె చేస్తుండటంతో మండలంలోని 51 అంగన్‌వాడి కేంద్రాలు మూత పడ్డాయి. దీంతో సచివాలయంలోని మహిళా పోలీసు, ఇంజనీరింగ్ అసిస్టెంట్, వాలంటర్‌లతో వీఆర్వో తాళాలు పగల కొట్టి కేంద్రాలు నడుపుతున్నారు.

గుడివాడలో...

అవనిగడ్డలో...

బంటుమిల్లిలో..

మచిలీపట్నంలో..

గుడ్లవల్లేరులో...

మోపిదేవిలో తాళాలు పగులగొడుతుండగా అడ్డుకుంటున్న జనసేన నాయకులు

పామర్రులో...

గన్నవరంలో...

గుడివాడరూరల్‌లో

వైసిపి, టిడిపిలకు బుద్ధిచెప్పండి

ఆర్‌పిసి వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్

ప్రజాశక్తి - విజయవాడ : జై ఆంధ్ర ఉద్యమస్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్‌ను కాపాడుకోవాలని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (ఆర్‌పిసి) వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ అన్నారు. విజయవాడ ప్రెస్‌క్లబ్లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉచిత పథకాల ముసుగులో ప్రజల శ్రమను దోచుకుంటున్నారని, కనీస వసతులకు, మౌలిక సదుపాయాలకు ప్రజలు నోచుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పౌరసేవలు సరిగా అందడంలేదన్నారు. విద్యా, వైద్యం ఖరీదైన వ్యాపారంగా పాలకులు మార్చేసారని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ నుండి అపార ఖనిజ సంపదను మోడీ సర్కార్ తరలించుకుపోతున్నా ప్రశ్నించలేని నిస్సహాయ స్థితిలో జగన్, చంద్రబాబు ఉన్నారన్నారు. ఇది వారి అసమర్థతకు నిదర్శనమన్నారు. రాష్ట్ర విభజన అనంతరం రాజకీయ లబ్ధికోసం జగన్, చంద్రబాబు రాష్ట్రాభివద్ధిని సర్వనాశనం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగు పరచకుండా ఓటర్లను బిక్షగాళ్ళగా మార్చేప్రయత్నం చేస్తున్నారని, అభివద్ధి లేకుండా తాము పాలకులం, శాసనకర్తలం అని కబుర్లు చెప్పుకుంటున్నారని విమర్శించారు. వైసిపి, టిడిపిలను ఓడించి రాష్ట్రంలో రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పార్టీని ఆంధ్రులు స్వాగతించాలని మేడా శ్రీనివాస్ కోరారు. ఈ సమావేశంలో ఐక్య కాపునాడు రాష్ట్ర అధ్యక్షులు బేతు రామ్మోనరావు, ఆర్‌పిసి నాయకులు పెండ్యాల కామరాజు, సిమ్మా దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా నాయకునిగా ఎలా ఎదగాలి' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ : 'ప్రజా నాయకునిగా ఎలా ఏదగాలి? ఎలా ఒదగాలి?" అనే పుస్తక ఆవిష్కరణ గుంటూరులో జరిగింది. సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పుస్తక రచయిత, కౌన్సెలింగ్ సైకాలజిస్ట్ అమరనాథ్ జగర్లపూడి పాల్గొన్నారు.

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలపై యుటిఎఫ్ నిరసన

షేక్ సాబ్జికి నివాళులు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం యుటిఎఫ్ ఆధ్వర్యాన నగరంలోని డిఇఒ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె శ్రీనివాసరావు, ఎ.సుందరయ్య మాట్లాడుతూ దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న సర్వీసు రూల్స్, బదిలీలు, ఎస్‌జిటి పోస్టుల అప్‌గ్రేడేషన్, పిఎఫ్ అకౌంట్స్, నోషనల్ ఇంక్రిమెంట్ల బకాయిలు తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. సర్వీస్ రూల్స్ విషయంలో ప్రభుత్వం, మంత్రి చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. 20 ఏళ్ల నుండి బదిలీలు లేకపోవడం శోచనీయమన్నారు. ఈ నేపథ్యంలో సర్వీస్ రూల్స్ వెంటనే విడుదల చేయాలని కోరారు. మున్సిపల్ టీచర్లకు 180 జిఒ ప్రకారం విద్యా శాఖ పరిధిలోకి వచ్చిన తర్వాత పిఎఫ్ అకౌంట్స్ లేకపోవడంతో భారీగా ఆదాయ పన్ను చెల్లించాల్సి వస్తోందన్నారు. ఎస్‌జిటి పోస్టులను అప్‌గ్రేడ్ చేసి ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈనెల 30న రాష్ట్రస్థాయి ధర్నాలో చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా నాయకులు ఎం.కష్ణయ్య, ఏ.అనంత్ కుమార్, కె.గంగరాజు, బి రెడ్ స్టార్, డి.హరి ప్రసాద్ , కే.నందానంద్, బి.రమణయ్య, ఎం.లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పిడిఎఫ్ ఎంఎల్‌సి షేక్ సాబ్జికి నివాళులు

రోడ్డు ప్రమాదంలో మరణించిన పిడిఎఫ్ ఎంఎల్‌సి, యుటిఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు షేక్ షాబ్జికి యుటిఎఫ్ నేతలు నివాళులర్పించారు. డిఇఒ కార్యాలయం వద్ద జరిగిన ధర్నా సమయంలో సాబ్జి చిత్రపటానికి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ సాబ్జి ఆకస్మిక మతి ఉపాధ్యాయ ఉద్యమానికి తీరనిలోటని అన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. సాధారణ ఉపాధ్యాయుడు స్థాయి నుండి అంచలంచెలుగా రాష్ట్ర స్థాయి నేతగా ఎదిగి ఎంఎల్‌సిగా ఎన్నికైన సాబ్జీ జీవితం ఆదర్శమన్నారు.

రాజధాని రైతుల పత్యామ్నాయ ప్లాట్లకు ఈ - లాటరీ

భూ కేటాయింపు పత్రాలు అందించిన ఎపి సిఆర్‌డిఒ కమిషనర్

ప్రజాశక్తి - విజయవాడ : భూ సమీకరణ పథకంలో భూములను ఏపీ సీఆర్డీఏ వారికి అప్పగించి ప్రత్యామ్నాయ ప్లాట్లు పొందేందుకు అంగీకారం తెలిపిన భూ యజమానులకు శుక్రవారం విజయవాడలోని ఏపీ సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో సంస్థ కమిషనర్ వివేక్ యాదవ్ ప్లాట్ల కేటాయింపు పత్రాలను అందించారు. ఈ - లాటరీ తీసి ప్లాట్లు కేటాయించారు. ఈ సందర్భంగా కమిషనర్ వివేక్ యాదవ్ మాట్లాడుతూ భూ సమీకరణ పథకంలో భాగంగా ఏపీ సీఆర్డీఏకు భూములిచ్చిన రైతులకు గతంలో నివాస, వాణిజ్య ప్లాట్లను కేటాయించామని తెలిపారు. వీటిలో 3,356 ప్లాట్లు భూ సమీకరణ పరిధిలోని భూ సేకరణ పూర్తికాని భూమిలో ఉన్నట్లు గుర్తించామని వివరించారు. తొలి విడతలో 679 రైతులను ప్రత్యామ్నాయ ప్లాట్లు పొందాలని నోటీసులు జారీ చేశామని, తదుపరి రెండో పర్యాయం కూడా నోటీసులు ఇచ్చామని తెలిపారు. ఈ నేపథ్యంలో 44 మంది రైతులు అంగీకారం తెలిపారని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వారికి ప్రత్యామ్నాయ ప్లాట్లు కేటాయించేందుకు ఆన్లైన్ ర్యాండమ్ సిస్టమ్ ద్వారా ఈ - లాటరీ తీసి భూ యజమానులకు ప్లాట్ల కేటాయింపు పత్రాలు అందించామన్నారు. 16 గ్రామాల పరిధిలోని భూ యజమానులకు 31 నివాస, 13 వాణిజ్య ప్లాట్లను అందజేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమం ఏపీ సీఆర్డీఏ అదనపు కమిషనర్లు కట్టా సింహాచలం, అలీం బాషా పర్యవేక్షణలో జరిగింది. ల్యాండ్స్ విభాగం జాయింట్ డైరెక్టర్ టి.చిరంజీవి, ప్లానింగ్ అధికారి ఆర్.నాగేశ్వరరావు, ఎం.లక్ష్మీ ప్రసన్న, 16 గ్రామాల కాంపిటెంట్ అథారిటీలు పాల్గొన్నారు.

గ్రంథాలయ సంస్థ సొసైటీ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - విజయవాడ : కష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ సమావేశం శుక్రవారం గవర్నరుపేటలోని ఠాగూర్ గ్రంథాలయంలో జరిగింది. ఈ సందర్భంగా సొసైటీ సభ్యులకు డివిడెంట్ చెక్కులను సంస్థ చైర్‌పర్సన్ తిప్పరమల్లి జమల పూర్ణమ్మ అందజేశారు. ఈ సమావేశం లో సొసైటీ అధ్యక్షుడు బి.విజయకుమార్, సభ్యులు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

అడ్డుకున్న ప్రజా సంఘాల నేతలు

చేస్తున్న అంగన్వాడీల సమస్యలను పరిష్కరించిన తర్వాతే వాటిని తెరవాలని తెగేసి చెప్పారు. దీంతో ఆయా కేంద్రాల వద్దకు వచ్చిన సచివాలయ సిబ్బంది వెనుదిరిగారు. ఎన్‌టిఆర్ జిల్లా నందిగామ 19వ వార్డు హనుమంతుపాలెం అంగన్వాడీ కేంద్రం తాళాలను పగులగొట్టేందుకు ప్రయత్నించిన సచివాలయ సిబ్బందిని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్, జిల్లా నాయకులు సయ్యద్ ఖాసిం, మందా యాకోబు మందా వెంకటేశ్వర్లు, తులసమ్మ, పలువురు స్థానికులు అడ్డుకున్నారు. అలాగే విజయవాడ 63వ డివిజన్ రాజీవ్ నగర్ వడ్డెర కాలనీ, సుందరయ్య నగర్లలోని నెంబరు 823 అంగన్వాడీ కేంద్రం, ఇతర కేంద్రాలను తాళాలు పగలకొట్టటాన్ని ఐద్వా ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి కె.శ్రీదేవి, సిఐటియు సెంట్రల్ సిటీ అధ్యక్షులు కె.దుర్గారావు, ప్రజా సంఘాల నాయకులు జి.ఝాన్సీ రాణి, సి.హెచ్ శ్రీను, బొంగు రాంబాబు, బొంగు అమ్ములు, నిర్మల తదితరులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ఎన్నికల ముందు అంగన్వాడీలు, ఆయాల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం నాలుగున్నరేళ్లవుతున్నా పరిష్కరించలేదని విమర్శించారు. ఈ నేపథ్యంలోనే అంగన్వాడీలు సమ్మెకు దిగారని తెలిపారు. అంగన్వాడీలు సమ్మె చేస్తుంటే వారి సమస్యను పరిష్కరించకుండా తాళాలు పగలగొట్టడం దుర్మార్గమన్నారు. ఇది వైసిపి ప్రభుత్వ దగాకోరుతానికి నిదర్శనమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సామరస్య పూర్వకంగా చర్చలు జరపకుండా బెదిరింపులకు దిగటం సిగ్గుచేటని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే అంగన్వాడీలను చర్చలకు పిలిచి వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.అలాగే అంగన్వాడీలకు మద్దతుగా గన్నవరంలో ప్రదర్శన జరిగింది. ఈ ప్రదర్శనలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, కృష్ణాజిల్లా కార్యదర్శి వై.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పేదల ముంగిటకే కార్పొరేట్ వైద్య సేవలు

ఆరోగ్య కేంద్రాలను అత్యాధునిక మౌలిక వసతులతో ఆధునీకరించి వైద్య సహాయాన్ని పేదల ముంగిటకే తీసుకువచ్చారన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ను ప్రవేశపెట్టి ప్రతి ఇంట్లో కుటుంబ సభ్యులకు ఆరోగ్య పరిక్షలు నిర్వహించి అనారోగ్యం దీర్ఘకాలిగా వ్యాధులతో భాదపడుతున్న వారిని గుర్తించి వారికీ అవసరమైన వైద్య సేవలు అందించడంతో పాటు ఉచితంగా మందులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మరింత మెరుగైన వైద్య సహాయం అవసరమున్న పేదలకు ఆరోగ్య శ్రీ పథకం ద్వారా ఉచితంగా వైద్య సేవలు, శస్త్ర చికిత్సలు అందిస్తున్నామన్నారు. దివంగత నేత డా. వై. ఎస్. రాజశేఖర్ రెడ్డి ఆశయాలను మరింతగా అమలు చేయాలనే సంకల్పంతో డా. వై. ఎస్.ఆర్ ఆరోగ్య శ్రీ పథకం కింద ప్రస్తుతం ఉన్న 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని 25 లక్షలకు పెంచుతూ రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు. ఇది పేదలకు మేలు చేయలన్న ముఖ్యమంత్రి ఆలోచనలకు నిదర్శనమన్నారు. వైద్య ఆరోగ్య రంగంతో పాటు విద్య వ్యవసాయ మహిళాభివద్ధి వంటి రంగాలలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చి పేదల సంక్షేమంపై దష్టి సారించినట్లు చెప్పారు. ఆర్థిక పరిస్థితులు ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసి రాష్ట్రాన్ని ఆదర్శవంతమైన రాష్ట్రంగా నిలిపిన ఘనత రాష్ట్ర ముఖ్య మంత్రికే దక్కిందన్నారు. ప్రజా సంక్షేమం వైపు అడుగులు వేస్తున్న ప్రభుత్వానికి అండగా నిలిచి రాష్ట్రాభివద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని మంత్రి తానేటి వనిత కోరారు. స్థానిక శాసన సభ్యులు, ప్లాన్నింగ్ బోర్డు ఉపాధ్యక్షులు మల్లాది విష్ణు మాట్లాడుతూ విజయవాడ పరిధిలో 41 పట్టణ ఆరోగ్య కేంద్రాల ద్వారా సుమారు 12 లక్షల మంది ప్రజలకు వైద్య సేవలు అందిస్తునటన్నట్లు తెలిపారు. డా. వై. ఎస్. ఆర్. ఆరోగ్య శ్రీ పథకం ద్వారా జిల్లాలో 49 ప్రైవేట్ ఆసుపత్రులతో పాటు గ్రామీణ, పట్టణ హెల్త్ సెంటర్లు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు ,ఏరియా ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జనరల్ ఆసుపత్రుల ద్వారా 3,257 రకాల వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్ అవుతూ శ్రీశైలజ రెడ్డి, డీఎంహెచ్వో డా. యం.సుహాసిని, స్థానిక కార్పొరేటర్లు, వైద్యఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం నాణ్యతపై ఎఫ్‌సిఐ బృందం పరిశీలన

కూడిన బృందం కృష్ణాజిల్లా ఘంటసాల మండలం దేవరకోట, గూడూరు మండలం కంచా కోడూరు గ్రామాల్లో పర్యటించి తడిసి, రంగుమారిన ధాన్యం నాణ్యతా ప్రమాణాలను పరిశీలించింది. కష్ణాజిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు నమూనాలను పంపిన నేపథ్యంలో జిల్లా ఫుడ్ కార్పొరేషన్ అధికారి డి.రాజు నేతత్వంలో ఎఫ్‌సిఐ కేంద్ర బృందం సభ్యులు, వ్యవసాయశాఖ అధికారులు, క్షేత్రస్థాయిలో పరీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా పౌరసరఫరాల అధికారి రాజు మాట్లాడుతూ తడిసిన, రంగుమారిన ధాన్యం నాణ్యతపై నివేదికను కలెక్టర్ ద్వారా కేంద్రానికి పంపుతామని తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.పద్మావతి మాట్లాడుతూ తుపాను నష్టంపై ఈనెల 18వ తేదీ నాటికి తుది నివేదికలు రూపొందించి రైతు భరోసా కేంద్రం నోటీసు బోర్డుల్లో ప్రదర్శించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ ఎడిఎ ఎస్.శ్యామల, జిల్లా పౌరసరఫరాల శాఖ క్వాలిటీ కంట్రోల్ మేనేజర్ కోటిరెడ్డి, ఘంటసాల తహశీల్దార్ బి.రామా నాయక్, ఘంటసాల మండల వ్యవసాయ అధికారి కె.మురళీ కష్ణ, విఎఎ సత్యదేవ్, గూడూరు జడ్‌పిటిసి, తహశీల్దారు విజయ ప్రసాద్, మండల వ్యవసాయ అధికారి జివి.శివ ప్రసాద్, ఆర్‌బికె మండల చైర్మన్ మున్నా, మచిలీపట్నం వాణి, సురేష్ రంగబాబు పాల్గొన్నారు.

ఒరిజినల్ పాస్‌పోర్ట్ మరియు సర్టిఫికెట్స్ పోయినవి

కృష్ణా జిల్లా, పామర్రు మండలం, పామర్రు గ్రామం, చౌదరి పేట, డోర్ నెంబర్ 19-14రు కాపురస్తులు కాజ వెంకట్రామయ్య కుమారుడు, కాజ వెంకటరమణ అను నేను మా స్వగ్రామం పామర్రు నుండి పామర్రు సెంటర్కు జిరాక్స్ నిమిత్తం బండి పై వెళ్ళుచుండగా మార్గమధ్యంలో **(A2697178)** అను నంబరు గల నా ఒరిజినల్ పాస్ పోర్ట్ మరియు సర్టిఫికెట్స్ పోయినవి. సదరు పాస్ పోర్ట్ గురించి ఎంత విచారించినను ఆచూకీ లభించలేదు. కావున పై నంబరు గల పాస్ పోర్ట్ ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్ ను సంప్రదించగలరు.

కాజ వెంకటరమణ, తండ్రి కాజ వెంకట్రామయ్య,
డోర్ నెంబర్.19-14, చౌదరి పేట, పామర్రు.
సెల్.9849533762

బహిరంగ ప్రకటన

నా క్లయింటు మరియు తెలంగాణా రాష్ట్రం, కె.వి.రంగారెడ్డి జిల్లా, మియాపూర్, స్ప్రింగ్‌బోర్డు పాఠశాల దగ్గర, ప్రగతి ఎన్‌క్లేవ్, శ్రీ హేమదుర్గ లక్ష్మి ఫ్రైడ్, బి-బ్లాక్, ఫ్లాట్ నెం.410రు కాపురస్తులు మొవ్వ శివనాగమల్లేశ్వరరావు గారి కుమారుడు మొవ్వ భానుప్రసాద్ గారు నాకు ఇచ్చిన సమాచారం మేరకు యావన్మందికి తెలియ చేయునది ఏమనగా...

ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్తిరాస్థి కృష్ణాజిల్లా, తోట్లవల్లూరు మండలం, పెనమకూరు గ్రామ కాపురస్తులు కొల్లిపర (లేటు) వెంకటరత్నం గారి కుమారుడు కాల్లిపర వెంకట బలరామకృష్ణ, కొల్లిపర (లేటు) వీరేంద్రకుమార్ గారి భార్య ఉమశ్రీ వీరి కుమారుడు అభిరామ్ అను వారికి తోట్లవల్లూరు మండలం, పెనమకూరు గ్రామ రీసర్వే నెం.164/1లో య.1-07ట్లు శేరీ పల్లం పూర్వార్జితముగా సంక్రమించిన స్తిరాస్తి క్రయం పొందుటకు నా క్లయింట్‌తో విక్రయ ఒప్పందం చేసుకొనియున్నారు.

సదరు స్థిరాస్థిని గురించి ఎవరికైనా ఎటువంటి అభ్యంతరములు గానీ, క్లయిములు గానీ, కోర్టు కేసులు గాని, ప్రోనోటు బాకీలు గాని మొదలగునవి ఏమైనా వున్న యెడల అట్టి వారు ఈ ప్రకటన వెలువడిన తేదీ నుండి 7 రోజులలోగా ఈ క్రింద తెలియ చేసిన నా అడ్రస్సుకు తగిన వ్రాత పూర్వక ఆధారములతో తెలియ పర్చవలెను. గడువు తేదీ దాటిన తదుపరి షెడ్యూలు దాఖలా స్థిరాస్థిపై ఎటువంటి లావాదేవీలు గాని, అభ్యంతరములు గానీ లేవు అని భావించి నా క్లయింటు విక్రయ దస్తావేజు వ్రాయించుకొని రిజిష్టరు పొందగలరు. గడువు తేదీ దాటిన తదుపరి వచ్చు ఎట్టి అభ్యంతరములు గాని, క్లయిములు గాని నా క్లయింటును బైండ్ చేయజాలవు అని తెలియ చేయటమైనది.

షెడ్యూలు:- కృష్ణాజిల్లా, ఉయ్యూరు సబ్ రిజిస్ట్రారు వారి ఇలాకా, తోట్లవల్లూరు మండలం, పెనమకూరు గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన పెనమకూరు గ్రామ రీసర్వే నెం.164/1లో య.1-07ట్లు శేరీ పల్లం భూమికి హద్దులు

తూర్పు: కనకమేడల అమరేంద్రప్రసాద్ గారి భూమి
దక్షిణం: కొల్లిపర బలరామకృష్ణ గారి భూమి
పడమర: కొల్లిపర బలరామకృష్ణ గారి భూమి
ఉత్తరం: మొవ్వ భానుప్రసాద్ మరియు యరగాని సాంబశివరావు వగైరాల భూమి

యీ హద్దుల మధ్య య.1-07ట్లు లేక హె.0.433ర్సు శేరీ పల్లం భూమి

ఉయ్యూరు
ది.15-12-2023

ఇట్లు
కాగిత గోపిచంద్,బి.ఎల్.,
అడ్వకేట్,
లక్ష్మీటాకీస్ గేటు ఎదురురోడ్డు,
ఉయ్యూరు మండలం,
ఉయ్యూరు-521165, కృష్ణాజిల్లా,
సెల్ నెం.9849286239, 918273262

విద్యతోపాటు క్రీడలూ అంతర్భాగం కావాలి

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : విద్యలో క్రీడలు అంతర్భాగం కావాలని అప్పుడే విద్యార్థుల సర్వతోముఖ అభివద్ధి జరుగుతుందని బెల్ కంపెనీ ఏజీఎం డి సహదేవుడు పేర్కొన్నారు.మచిలీపట్నంలోని స్థానిక పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ లో వార్షిక క్రీడా దినోత్సవం, కేంద్రీయ విద్యాలయ సంఘటన్ 60వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి విద్యాలయాల్లో ఎక్కడ క్రీడలకు ప్రాధాన్యం లేకపోవడం వల్ల అనేక రకాల శారీరక రుగ్మతల బారిన పడుతున్నారన్నారు.అందువల్ల ప్రతి విద్యా సంస్థ లో కేంద్రీయ విద్యాలయ మాదిరిగా ప్రతిరోజు విద్యార్థులకు క్రీడ సమయాన్ని కేటాయించాలన్నారు. దీని ద్వారా విద్యార్థుల శారీరక మానసిక ఆరోగ్యం చేకూరుతుందని ఆయన స్పష్టం చేశారు. ప్రిన్సిపల్ మహమ్మద్ ఆసిఫ్ హుస్సేన్ మాట్లాడుతూ విద్యార్థుల సంపూర్ణ వికాసానికి క్రీడలు దోహదం చేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యుడు ఫణి కుమార్, యూబీఐ ఫౌండర్ బ్రాంచ్ మేనేజర్ ఉమాదేవి, విశ్రాంత బెల్ సివిల్ ఇంజనీర్ ఏ. ఆర్. కే. ప్రసాద్, ఏ. పి. ఎస్. ఆర్. టీ. సీ. డిపో మేనేజర్ టీ. పెద్దిరాజు, సైకియాట్రిస్ట్ ప్రభు రామ్ లు విశిష్ట అతిధులుగా పాల్గొన్నారు. కార్యక్రమం లో హెచ్ఎమ్ గ్లోరీ స్వరూప రాణి పిజిటీలు,టీ జి.టీ లు, పి ఆర్ టీ లు పాల్గొన్నారు. వివిధ ఆటల పోటీలు నిర్వహించి విజేత లకు బహుమతి లు అందించారు.

కౌలు రైతును పరామర్శించిన ఎంఎల్ఎ

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఇటీవల సంభవించిన తుఫాను కారణంగా పంటలు నష్టపోయి దిక్కుతోచని పరిస్థితిలో కోడూరు మండలం వి కొత్తపాలెం గ్రామానికి చెంది న కౌలు రైతు బాదర్ల సూర్యప్రకాష్ రావు పురుగుమందు సేవించి ఆత్మహత్యకు పాల్పడగా ఆయనను అవనిగడ్డ ఏరియా వైద్యశాలలో చేర్పించి కుటుంబ సభ్యులు చికిత్స చేయిస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు వెళ్లి చికిత్స పొందుతున్న ప్రభాకర్ రావును కలసి పరామర్శించారు. కౌలు విషయం మీద వ్యవసాయ అధికారులతో మాట్లాడి పూర్తి నష్టపరిహారం అందాల ప్రభుత్వం అన్ని రకాలుగా తోడుగా ఉంటుందని తెలియజేశారు.

దేవమ్మ మృతికి సంతాపం

ప్రజాశక్తి-ఉంగుటూరు : వేంపాడు పిఏసిఎస్ చైర్మన్ నాగనబోయిన సోమేశ్వరరావు తల్లి దేవమ్మ అనారోగ్యంతో శుక్రవారం తుది శ్వాస విడిచారు. పెనమలూరు శాసనసభ్యులు కొలుసు పార్థసారథి, గన్నవరం శాసనసభ్యులు వల్లభనేని వంశీ మోహన్, ఉంగుటూరు మండల వైయస్సార్సీపి అధ్యక్షులు వింత శంకర్ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ గుడిసె బాలస్వామి, నాయకులు ఉప్పల రాము, నాని, కొలుసు కష్ణ దేవమ్మ భౌతిక కాయానికి పూల మాల వేసి నివాళులర్పించారు.

మంచినీటి పైపులైన్ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ కొత్తపేట రోడ్ లో ఉన్న ఆర్టీసీ కాలనీలో ఏపీఎస్ఆర్టీసీ వర్కర్స్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ ఆధ్వర్యంలో కాలనీలో కాలనీ వాసుల ఆర్థిక సహకారంతో మంచినీటి పైపులైను ఏర్పాటుకు శుక్రవారం ప్రారంభోత్సవం చేశారు. ఆర్టీసీ కాలనీలో పైపులైను నిర్మాణానికి గ్రామ సర్పంచ్ గో రుముచ్చు ఉమా, ఎంపీపీ తుంగల సుమతి దేవి, వైసిపి నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వర రావు లు శంకుస్థాపన చేశారు. 2.1 లక్షలు తో ఏర్పాటు చేస్తున్న ఈ పైపులైను బ్యాంకు ద్వారా ఒంగోలు భగీరథ కంపెనీ ద్వారా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పార్టీ రాష్ట్ర యువజన విభాగం జాయింట్ సెక్రెటరీ గాజుల జయ గోపాల్, మండల పార్టీ అధ్యక్షులు రేపల్లె శ్రీనివాసరావు, మండల కోఆప్షన్ సభ్యులు షేక్ నజీర్ భాష పాల్గొన్నారు

తపాలా ఉద్యోగుల సమ్మెకు సిఐటియు మద్దతు

నినాదాలు చేస్తున్న గ్రామీణ డాక్ సేవకులు, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్ :దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న వేతన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తు మండల కేంద్రమైన బాపులపాడు గ్రామలోని పోస్టాఫీసు పరిధిలో పనిచేస్తున్న గ్రామీణ డాక్ సేవక్ లు చేపట్టిన నిరవధిక సమ్మెకు శుక్రవారంతో నాలుగో రోజుకు చేరుకుంది.ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్, నేషనల్ యూనియన్ ఆఫ్ గ్రామీణ డాక్ సేవక్స్ సంఘాలు ఇచ్చిన దేశ వ్యాప్త సమ్మె పిలుపులో భాగంగా హనుమాన్జంక్షన్ పోస్టాఫీసు లో పనిచేస్తున్న గ్రామీణ తపాలా సిబ్బంది సమ్మె పాటించారు. సమస్యల పరిష్కారం కొరకు గత నాలుగు రోజులుగా సమ్మె నిర్వహిస్తున్న పోస్టల్ సిబ్బందికి సిఐటియు మండల కార్యదర్శి నల్లి ఆంజనేయులు,. నాయకులు వారికి మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సత్యనారాయణ,పి. నాగేశ్వరరావు, వేదనయకం,ఈశ్వరరావు, సుభానీఖాన్, విజయ్ కుమార్, మహిళ సిబ్బంది, సిఐటియు బిల్డింగ్ టౌన్ అధ్యక్షులు రాజనాల సురేష్ పార్సిల్, ముఠా నాయకులు సురేష్, సిమెంట్ నాయకులు రాము, ధర్మ రైతు సంఘం నాయకులు తోట సాంబశివరావు, గ్రామ పంచాయతీ మండల నాయకులు సన్నపాల సత్యం రావు పాల్గొన్నారు.

గెలుపే ధ్యేయంగా పనిచేయాలి : రావి, వెనిగండ్ల

ప్రజాశక్తి-గుడివాడ : గడివాడ నియోజక వర్గంలో గెలుపే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేవ్వరరావు, గుడివాడ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వెనిగండ్ల రాములు అన్నారు. తెలుగుదేశం పార్టీ నందివాడ సమన్వయ సమావేశం మండల పార్టీ ప్రెసిడెంట్ దానేటి సన్యాసిరావు అధ్యక్షతన శుక్రవారం జరి గింది. ఈ సందర్భంగా రావి మాట్లాడుతూ తెలుగు దేశం పార్టీ గెలుపే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. 20 ఏళ్లగా గుడివాడ అభివద్ధికి దూరంగా ఉందన్నారు. గుడివాడలో తెలుగుదేశం పార్టీ జెండా ఎగురవేసి గుడివాడకు పూర్వ వైభవం తీసుకువస్తామన్నారు. వెనిగండ్ల రాము మాట్లాడుతూ గుడివాడలో తెలుగుదేశం పార్టీని గెలిపించుకుని ఆ విజయాన్ని భువనమ్మకు కానుకగా ఇద్దామన్నారు. ఈ సమావేశంలో నందివాడ మండలం నుంచి మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు 24 పంచాయతీలకు సంబంధించిన గ్రామ పార్టీ ఇన్చార్జిలు పాల్గొనటం జరిగింది.

మాట్లాడుతున్న నందివాడ మండలాధ్యక్షుడు దానేటి సన్యాసిరావు

లబ్ధిదారులు త్వరగా ఇళ్లు నిర్మించుకోవాలి : సర్పంచ్

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్: ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పేద ప్రజల హదయాలలో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని బాపులపాడు సర్పంచ్ సరిపల్లి కమలా కిరణ్ అన్నారు. బాపులపాడు గ్రామంలో జగనన్న కాలనీ లేఅవుట్ 2 లో లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు నిర్ధారణ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ బాపులపాడు గ్రామంలో జగనన్న కాలనీ 1వ లేఅవుట్ లో 640 కుటుంబాలకు ఇళ్ళ స్థలాల పట్టాలు ఇచ్చారని ఇప్పటికే 400 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయని అన్నారు. ఇప్పటికే 1వ లే అవుట్ కు అన్నీ సౌకర్యాలు కల్పించినట్లు ఆమె తెలిపారు.2వ లే అవుట్ లో కూడా యుద్ధ పాదిపదికన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని లబ్ధిదారులు వెంటనే ఆలస్యం చేయకుండా ఇళ్లు నిర్మించుకోవాలని సర్పంచ్ కమలాబాయి అన్నారు. మండల వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నక్కా గాంధీ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఎం.పి.పి యరగొర్ల నగేష్,మండల కన్వీనర్ అవిర్నేని శేషగిరి రావు, బాపులపాడు పిఎసిఎస్ అధ్యక్షుడు చైర్మెన్ దయాల విజయ నాయుడు, జడ్పిటిసి కొమరవల్లి గంగా భవానీ, ఎం ఆర్ ఓ సిహెచ్ నరసింహారావు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలపై అవగాహన

ప్రజాశక్తి, గుడ్లవల్లేరు : మండలంలోని అంగలూరు జిల్లా ప్రభుత్వ విద్యా శిక్షణా సంస్థ (డైట్), నందు భారత ప్రభుత్వ మంత్రిత్వ శాఖ అనుబంధ విభాగం సైన్స్ అండ్ టెక్నాలజీ (డి.ఎస్.టి.), న్యూఢిల్లీ ప్రాజెక్టు వెలుగు బాట శుక్రవారం రెండో దశ రెండో రోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో భాగంగా పదవ తరగతి అభ్యసిస్తున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నిరుపయోగంగా ఉన్న వస్తువుల ద్వారా నూతన ఆవిష్కరణలను ఎలా చేయవచ్చు అను అంశముపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో వెంకీ సైన్స్ ప్రాజెక్ట్ సహ వ్యవస్థాపకుడు మరియు సి.ఈ.ఓ. పెనుమర్తి వెంకటేష్ పాల్గొని వాటర్ బాటిల్ మోటారు, బ్లూటూత్ కార్, మేజిక్ మ్యాచ్ బాక్స్, 3డి క్రిస్టమస్ ట్రీ, వాటర్ లెవెల్ ఇండికేటర్ వంటి వివిధ నమూనాలను విద్యార్థులకు పరిచయం చేశారు. ఇందులో ముఖ్యంగా విద్యార్థినీ విద్యార్థులలో సైంటిఫిక్ టెంపర్ మెంట్ సైన్స్ ప్రయోగాలు, సైన్స్ ప్రదర్శనలు, సైన్స్ కార్యశాలల ద్వారా కలిగించడమే తన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, క్విజ్ పోటీలు నిర్వహించారు. సుమారు 200 మంది విద్యార్థినీ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొనినట్లు ఎస్.ఆర్.జి.ఈ.సి. డైరెక్టర్, ప్రాజెక్ట్ ప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ జి.వి.ఎస్.ఎన్. ఆర్.వి. ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.కరుణ కుమార్, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ పి. కోదండ రామారావు, డాక్టర్ ఎం.ఆర్.సి.హెచ్. శాస్త్రి, యాజమాన్య సలహాదారులు డాక్టర్ పి. రవీంద్ర బాబు,పాల్గొన్నారు.

5న ఓటర్ల తుది జాబితా ప్రకటన

ప్రజాశక్తి-అవనిగడ్డ : జనవరి 5వ తేదీ నాటికి ఓటర్ల తుది జాబితా ప్రకటించనున్నట్లు నియోజకవర్గ ఎలక్ట్రోల్ అధికారి డి పార్వతి దేవి తెలిపారు. అవనిగడ్డ తాసిల్దార్ కార్యాలయం వద్ద ఓటర్లకు సంబంధించిన అవకతవకల ఫిర్యాదులను పరిశీలించేందుకు విచ్చేసిన ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈనెల 25వ తేదీ లోపు ఓటర్లకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులపై పరిశీలించడం జరుగుతుందన్నారు. దీనితోపాటు రాబోయే ఎన్నికలలో ఈవీఎంలను ఉపయోగించే విధానంపై కూడా అవగాహన కల్పిస్తున్నట్లు ఎలక్ట్రోరల్ అధికారి పార్వతి దేవి తెలిపారు.

ఎంఎల్‌సి సాబ్జీ మృతికి సంతాపం

ప్రజాశక్తి - గుడివాడ : ఎమ్మెల్సీ షేక్ సాబ్‌జి మృతికి సిపిఎం పట్టణ కార్యదర్శి ఆర్ సి పి రెడ్డి శుక్రవారం సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానిక సిపిఎం పార్టీ కార్యాలయంలో ఆర్‌సిపి రెడ్డి మాట్లాడుతూ ఉభయగోదావరి జిల్లా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి మతికి సిపిఎం పార్టీ గుడివాడ కమిటీ తీవ్ర విచారణ వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు తీవ్ర సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గన్నవరం** : ఉపాధ్యాయ ఉద్యమ నేత గౌరవ పిడిఎఫ్ ఎమ్మెల్సీ షేక్ షాబ్జీ రోడ్ ప్రమాదంలో మతి చెందడం బాధాకరం అని టిడిపి గన్నవరం నియోజకవర్గ ఇన్చార్జ్ యార్లగడ్డ వెంకట్రావు పేర్కొన్నారు. వారి మరణం మన ఉపాధ్యాయ లోకానికి తీరని లోటు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతుని కోరుకుంటూ వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియపరుస్తున్నాను.

సిఐటియు పెడన పట్టణ మాజీ అధ్యక్షులు హుస్సేన్ మృతి

ప్రజాశక్తి పెడన : పట్టణ సిఐటియు మాజీ అధ్యక్షులు, ప్రముఖ ముస్లిం వక్త ఎండి హుస్సేన్ (70) అకాల మృతి చెందారు. విషయం తెలుసుకున్న సిపిఎం,సిపిఐ లతోపాటు పలు పార్టీ నాయకులు ఆయన పార్థావ దేహాన్ని సందర్శించి ఘన నివాళులు అర్పించారు. సిపిఎం పట్టణ కార్యదర్శి బల్ల గంగాధర్, రాష్ట్ర చేనేత సంఘ అధ్యక్షులు కట్టా హేంసుందర్రావు పాటు పలువురు ప్రముఖులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

వెంకట సుబ్బయ్య మృతికి సంతాపం

ప్రజాశక్తి, గుడివాడ రూరల్: ప్రముఖ సాహితీ వేత్త, గుడివాడ పట్టణంలో ఆర్డీవోగా విధులు నిర్వహించిన సోమేపల్లి వెంకట సుబ్బయ్య గురువారం మృతి చెందారు. ఆయన ఉద్యోగ విరమణ పొంది గుంటూరులో నివాసం ఉంటున్నారు. కుమారుడు అమెరికా నుంచి రాగానే శనివారం ఆయన మృత దేహాన్ని ప్రయోగాల నిమిత్తం కుటుంబ సభ్యులు ఆసుపత్రికి ఇవ్వనున్నారు. ఆయన మరణ వార్త తెలుసుకున్న సిపిఎం గుడివాడ క్యాదర్శి ఆర్‌సీపీ రెడ్డి తన ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయనతో పాటు సాహితీ ప్రియులు లంకా సురేంద్ర, బివి శ్రీనివాసరావు, వసుదా బసవేశ్వరరావు, వీరమ్మ, అవిర్నేని వెంకటేశ్వరరావు తదితరులు సంతాపం తెలిపారు.

నేడు టిడిపి విస్తృత స్థాయి సమావేశం

ప్రజాశక్తి - గుడివాడ : తెలుగు దేశం పార్టీ గుడివాడ నియోజక వర్గ విస్తత స్థాయి సమావేశం 16 తేదీ శనివారం బంటుమిల్లి రోడ్డు లోని అలంకత ఫంక్షన్ హాలు నందు ఉదయం 10గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు టీడీపి నియోజకవర్గ ఇన్చార్జ్ వెనిగండ్ల రాము శుక్రవారం పేర్కొన్నారు. ఈ సమావేశానికి గుడి వాడ నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, వార్డులు, మండలాలు, గ్రామాల ఇన్ఛార్జిలు పాల్గొనాలని వెనిగండ్ల రాము కోరారు.

ఇళ్ల పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి-కోడూరు : రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వన్ టైం సెటిల్మెంట్ (ఓ టి ఎస్) ఇంటి పట్టాల ద్వారా 50 వేల నుంచి లక్ష రూపాయల వరకు బ్యాంకులలో లోను తీసుకోవచ్చని అవనిగడ్డ నియోజకవర్గం ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. శుక్రవారం కోడూరు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని గతంలో మండల వ్యాప్తంగా నగదు చెల్లించిన 428 మందికి పట్టాలు అందజేశారు. ఎంపీపీ కొండవీటి వెంకట కుమారి, జడ్పిటిసి యాదవ రెడ్డి వెంకట సత్యనారాయణ, ఎంపీడీవో ఆర్ శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ వెన్నా షైనీ పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రూట్స్ డే వేడుకలు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం శ్రీ ప్రజ్ఞ పాఠశాలలో శుక్రవారం ఫ్రూట్స్ డే సెలబ్రేషన్స్ ఘనంగా జరిగాయి. ఈ కార్య క్రమం సందర్భంగా ఫ్రూట్స్ ఎగ్జిబిషన్ ద్వారా విద్యార్థులకు సీజనల్ వలన ఉపయోగాలను ఫ్రూట్స్ గురించి వివరించారు. సీజనల్ ఫ్రూట్సెను ప్రతిఒక్కరూ ఆనడం వలన ఆరోగ్యకరంగా ఉంటారని వివరించడం జరిగింది.పాఠశాల డైరెక్టర్ పవన్ కుమార్, ప్రధానోపాధ్యాయురాలు శైలజ రాజ రాజేశ్వరి పాల్గొన్నారు.

తుపాను బాధితులకు సహకరించండి

బాల రక్షా సంస్థ పిలుపు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : మిచౌంగ్ తుపాను కారణంగా నష్టపోయిన వారికి సహకారం అందించేందుకు ముందుకు రావాలని ప్రముఖ సామాజిక సంస్థ బాల రక్షా భారత్ సంస్థ ప్రతినిధి ఈశ్వర్ పిలుపునిచ్చారు. నగరంలోని ఎం.జి. రోడ్డులోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తుఫాను కారణంగా మన రాష్ట్రంలో నాలుగు జిల్లాల్లో దాదాపుగా కోటి మందికి ప్రజలు ప్రభావితమయ్యారని అన్నారు. ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలు, వరదలు కారణంగా లోతట్టు ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. రాష్ట్రంలో తుఫాను కారణంగా 9500 మంది వారి నివాసాలు ఖాళీ చేసి పునరావాసాలకు తరలించారని తెలిపారు. వీరికి తగిన విధంగా ప్రోత్సాహం అందించేందుకు తమ సంస్థ ముందుకు వచ్చిందని ఇప్పటికే పలు విధాలుగా సహకారం అందించామని, ఇతర సంస్థలు కూడా సహకారం అందిస్తే పెద్ద ఎత్తున సహాయ సహకారాలు ఇవ్వగలమని ఈసందర్భంగా ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. తమ సంస్థ వివరాల కోసం బాల బారత్ డాట్ ఒఆర్‌జి ద్వారా తెలుసుకోవచ్చని తెలిపారు.

నూతన మేనేజ్‌మెంట్ కోర్సులు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : హెర్బాలైఫ్ – షులిని విశ్వవిద్యాలయం సంయుక్తంగా మేనేజ్‌మెంట్ కోర్సులను అందించేందకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అజయ్ కన్నా తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలను తెలియచేశారు. హిమాచల్ ప్రదేశ్‌లోని షులిని యూనివర్శిటీ ఆఫ్ బయోటెక్నాలజీ సంస్థతో పలు కోర్సులను వచ్చే విద్యా సంవత్సరం నుండి రూపకల్పన చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఎంబిఎ), బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (బిబిఎ) కోర్సుల్లో డైరెక్ట్ సెల్లింగ్ అనే నూతన కోర్సులను ప్రారంభిస్తున్నామని తెలిపారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ డైరెక్ట్ సెల్లింగ్ ఇన్ అకాడమిక్స్ (సీఈడీఎస్ఏ) సంస్థను ఏర్పాటుచేసి విద్యార్థులకు కావాల్సిన స్కిల్స్‌ను అందించనున్నట్లు తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరం నుండి కొత్త అకడమిక్ క్యాలెండర్‌లో ఈకోర్సు ఉంటుందని తెలిపారు.

'మాస్టర్ మైండ్స్'కు ఎక్సలెన్స్ అవార్డు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : బ్రెయిన్ ఫీడ్ సంస్థ దేశంలోనే అత్యున్నత విద్యా సంస్థలకు అందించే స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డును నగరంలోని మాస్టర్ మైండ్స్ స్కూల్‌కు లభించింది. హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో శుక్రవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో స్కూల్ అధినేత పెంట్యాల అనిల్ కుమార్‌కు నిర్వాహకులు అందచేశారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ అత్యున్నతస్థాయి విద్యా ప్రమాణాలతో అత్యుత్తమ విద్యను అందిస్తున్నామని అందుకే తమకు అవార్డు లభించిందన్నారు. అవార్డు లభించడం తనకు ఎంతో ఆనందంగా ఉందని రానున్న కాలంలో విద్యా సంస్థ అభివృద్ధితో పాటు రెట్టింపు ఉత్సాహంగా పనిచేసేందుకు అవకాశంగా భావిస్తానని తెలిపారు. స్కూలు ఉన్నతికి విద్యార్థుల మంచి ఫలితాలతో పాటు, తల్లిదండ్రుల సహకారం కూడా ఉందని తెలిపారు.

21న వేలం పాట

జగ్గయ్యపేట: గరికపాడు ఆర్టిఏ చెక్ పోస్ట్‌లో రికార్డులు లేకుండా తిరుగుతూ పట్టుబడ్డ వాహనాలకు 21న వేలం వేయనున్నట్లు నందిగామ రవాణా శాఖాధికారి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. కన్‌స్ట్రక్షన్ ఎక్విప్‌మెంట్ వెహికల్ చాసిస్ నెం. ఎల్‌ఐ 20 ఇవి 2115, ఎపి 37 టిబి 4891 (ఎల్‌జివి), జగ్గయ్యపేట అర్‌టిసి డిపోలో ఎపి 16 టివై 4945 (జిఎల్‌వి), ఎపి 35 టి 9764 (సిసిబసు) ఉన్న వాహనలకు సంబంధించిన యజమానులకు, ఫైనాన్షియర్లకు పలుమార్లు తెలిపారు. ఎవరూ రాకపోవడంతో వేలం వేసేందుకు నిర్ణయించారు. 19వ తేదీ లోపు యజమానులు రాకపోతే 21న వేలం వేయనున్నట్లు తెలిపారు.

22న జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : విద్యార్థుల్లో సృజనాత్మకశక్తిని పెంపొందించేందుకుగానూ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 22న ఎన్‌టిఆర్ జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌ను నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సి.వి.రేణుక తెలిపారు. ఎం.జి.రోడ్డులోని ఎన్‌టిఆర్ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో శుక్రవారం ఉదయం సైన్స్ ఫెయిర్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యాశాఖాధికారి రేణుక మాట్లాడుతూ అజిత్‌సింగ్‌నగర్‌లోని ఎం.కె.బేగ్ మునిసిపల్ కార్పొరేషన్ పాఠశాలలో సైన్స్ ఫెయిర్ జరుగుతుందని జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థులు తమ ప్రదర్శనలను ఏర్పాటుచేయాలని కోరారు. ఇప్పటికే పాఠశాల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల నుండి సుమారుగా 120 ప్రాజెక్టులు జిల్లా స్థాయి పోటీలలో పాల్గొంటున్నాయని తెలిపారు. ప్రతి మండలం నుండి ఆరు ప్రాజెక్టులు చొప్పున జిల్లా స్థాయి పోటీలకు మండల విద్యాశాకాధికారుల సమక్షంలో ఎంపికచేయనున్నారని తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రదర్శనాంశాలు భౌతికశాస్త్రం. రసాయన శాస్త్రం, జీవశాస్త్రం, బయో కెమిస్ట్రీ, అట్మాస్ఫియర్ సైన్స్ ఎర్త్ సైన్స్ ఎన్విరాన్‌మెంట్ సైన్స్, మ్యాథమేటిక్స్ కంప్యూటర్ సైన్స్ సంబంధించిన అంశాలలో ప్రదర్శనలు ఏర్పాటుచేయవచ్చని తెలిపారు. ఇందులో ఉత్తమ ప్రదర్శనలు రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికచేయనున్నారని తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ మైనం హుస్సేన్, ఏడి రాజేశ్వరి, సూపరింటెండెంట్ నాగరాజు, సూరిబాబు, రమణ పాల్గొన్నారు.

ఎపిపిఎస్‌సి గ్రూప్-1,2 పరీక్షలకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : ఎపిపియస్‌సి, గ్రూప్–1, గ్రూప్–2 రిక్రూట్మెంట్ ప్రిలిమినరీ పరీక్షల ఉచిత శిక్షణలకు ఉమ్మడి కష్ణా జిల్లాకు చెందిన అర్హులైన వెనుకబడిన తరగతులు (బి.సి), షెడ్యూల్డ్ కులాలు (ఎస్.సి), షెడ్యూల్డ్ తెగలకు (ఎస్‌టి) చెందిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ స్టడీసర్కిల్ ఫర్ బ్యాక్వర్డ్ క్లాసెస్, జిల్లా సంచాలకులు ఎం.రుక్మాంగదయ్య ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. గ్రూప్–2కు ఈనెల 22 వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవలసి ఉంటుందని, 100 మంది అభ్యర్థులకు ఈ నెల 27వ తేదీ నుండి 50 రోజుల పాటు ఉచిత శిక్షణతో పాటు స్టైఫండ్, స్టడీమెటీరియల్ ఏర్పాటు చేయబడుతుందన్నారు, గ్రూప్–1కు అభ్యర్థులు ఈ నెల 31 తేదీ లోగా దరఖాస్తు చేసుకోవలసి ఉంటుందని, 60 మంది అభ్యర్థులకు జనవరి నెల 5వ తేదీ నుండి 60 రోజుల పాటు ఉచిత శిక్షణతో పాటు స్టైఫండ్, స్టడీమెటీరియల్ ఏర్పాటు చేయబడుతుందని తెలిపారు. అభ్యర్థుల యొక్క ఎంపిక విధానం డిగ్రీలో వచ్చిన మార్కుల మెరిట్ ప్రాతిపదికపై ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు 10వ తరగతి మార్కులిస్టు, డిగ్రీ మార్కులిస్టులు, కుల ధవీకరణ, ఆదాయ ధవీకరణ పత్రం (తల్లి దండ్రుల వార్షిక ఆదాయం రూ.1,00,000/ లోపు మాత్రమే), ఆధార్, బ్యాంక్ పాస్ బుక్ జిరాక్స్, 2 పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు జతపరచవలసి వస్తుందన్నారు. గ్రూప్–2కు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులు ఈనెల 22వ తేదీ, గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షల ఉచిత శిక్షణకు అభ్యర్థులు ఈ నెల 31 తేదీ లోగా సంచాలకులు బి.సి. స్టడీసర్కిల్, 74–2–1/5, అశోక్ నగర్, రోడ్ నెం: 8, పండరీపురం, విజయవాడ వారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవలసి ఉంటుందని, ఇతర వివరాలకు స్టడీసర్కిల్ ఫోన్ నంబర్లకు నెం.9505094349/ 9966849937కు సంప్రదించగలరని బి.సి.స్టడీసర్కిల్, జిల్లా సందాలకులు యం.రుక్మాంగదయ్య ఆ ప్రకటనల్లో తెలిపారు.

పాలిటెక్నిక్ పోటీల్లో ఆర్‌కె విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి ఇబ్రహీంపట్నం : స్థానిక ఆర్కే కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ విద్యార్థులు నందిగామ పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన 26వ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఫర్ గర్ల్స్ రీజినల్ లెవెల్ పోటీల్లో వివిధ పోటీల్లో పాల్గొని వాటిలో ఒకటైన వాలీబాల్ గేమ్‌లో గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులతో పోటీ పడగా రన్నర్స్‌గా మిగిలారు. అలాగే ట్రిపుల్ జంప్ గేమ్‌లో సెకండ్ లెవెల్‌లో ఒకరు గెలుపొందారు. ఈ సందర్భంగా నందిగామ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్‌రావు విద్యార్థులకు చదువుతోపాటు క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని ఆకాక్షించి ఫైనల్‌లో గెలుపొందిన ఓడిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ విద్యార్థుల యొక్క నైపుణ్యాన్ని వెలికి తీసి ఇంటర్ లెవెల్ గేమ్స్‌లో పార్టిసిపేట్ చేయడానికి ఎంతో కషి చేసిన కళాశాల పిడి

ఎంవివి.మురళీనాథ్‌ను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.రామకృష్ణయ్య అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది గెలుపొందిన విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

17న 'మైనారిటీ హక్కులు, బాధ్యతలు'పై సదస్సు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఆల్ ఇండియా మిల్లీ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఈనెల 17వ తేదీన నగరంలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం నందు ' మైనారిటీ హక్కులు, బాధ్యతలు ' అనే అంశంపై సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు ఆలిండియా మిల్లీ కౌన్సిల్ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి మునీర్ అహ్మద్ తెలిపారు. ఈ సందర్భంగా కౌన్సిల్ సమావేశానికి రావాల్సిందిగా ఉప ముఖ్యమంత్రి ఎస్.బి అంజద్ భాషాను, ఆలిండియా మిల్లీ కౌన్సిల్ ఝూతీయ కార్యదర్శి షా ఖాద్రిని కలిసినట్లు సభ వివరాలను తెలియచేసినట్లు తెలిపారు. డిసెంబరు 18వ తేదీన మైనారిటీ రైట్స్ డే పురస్కరించుకుని ఈసభను నిర్వహిస్తున్నామని అన్నారు. వక్ఫ్ చట్టం 1995ను రద్దు చేయాలని కోరుతూ బిజెపి ఎంపి హర్నాథ్ సింగ్ యాదవ్ రాజ్యసభలో గత శుక్రవారం బిల్లును ప్రవేశపెట్టారన్నారు. ఈబిల్లును కాంగ్రెస్ టీఎంసీ, డీఎంకే సిపిఎం, సిపిఐ తదితర ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయన్నారు. బిల్లుకు అనుకూలంగా 53 మంది, ప్రతికూలంగా 32 మంది ఓటు వేశారన్నారు. దీనిపై చర్చించేందుకు ఈసదస్సు నిర్వహిస్తున్నామని ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఉపముఖ్యమంత్రిని కలసిన వారిలో మిల్లీ కౌన్సిల్ సభ్యులు అబ్దుల్ ఖదీర్, యాసుఫ్ పాల్గొన్నారు.

క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలి

ప్రజాశక్తి - నందిగామ : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ ఆసక్తి పెంపొందించుకోవాలని నందిగామ ఎంఎల్ఎ మొండితోక జగన్ మోహన్‌రావు పేర్కొన్నారు. నందిగామ పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన 26 వ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఫర్ గర్ల్స్ రీజినల్ లెవెల్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు నందిగామ ఎంఎల్ఎ మొండితోక జగన్ మోహన్‌రావు శుక్రవారం బహుమతులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొంటే మానసికోల్లాసం కలుగుతుందని, అంతేకాకుండా భవిష్యత్తులో ఉద్యోగావకాశాల్లో కూడా క్రీడాకారులకు తగిన ప్రాధాన్యం లభిస్తుందని వివరించారు. గెలుపోటములతో సంబంధం లేకుండా, క్రీడాకారులంతా క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి కూడా క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఆడుదాం ఆంధ్రా పేరుతో డిసెంబర్ 26 నుంచి క్రీడా పోటీలను తలపెట్టారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కళాశాల అధ్యాపకులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న నాయకులు

షేక్ షాబ్జీకి ఘన నివాళి

విస్సన్నపేట : ఈస్ట్ వెస్ట్ నియోజకవర్గ టీచర్స్ ఎమ్మెల్సీ నాయకులు షేక్ షాబ్జీ మృతికి యుటిఎఫ్, మండల ప్రజాసంఘాల నాయకులు నివాళులర్పించారు. ఈ మేరకు కార్యక్రమం స్థానిక సుందరయ్య భవనంలో జరిగింది. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి బి.సూర్యనారాయణ అధ్యక్షత వహించి మాట్లాడారు. షాబ్జీ లేని లోటు తీరనిదన్నారు. షాబ్జీ ఎన్నో నిరంతర ప్రజా ఉద్యమాల్లో పోరాడారన్నారు. యుటిఎఫ్ ఉమ్మడి జిల్లా మాజీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, ఏలూరు జిల్లా యుటిఎఫ్ కార్యదర్శి వీరకోటి మాట్లాడుతూ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ ఉద్యమానికి సంఘీభావం తెలిపేందుకు వెళ్తూ ఆయన మృతిచెందారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం విస్సన్నపేట మండల కార్యదర్శి నాగరాజు విస్సన్నపేట సిపిఎం నాయకులు మేకల జ్ఞానరత్నం, ధనలక్ష్మి, రంగరాణి, పులిబల్ల ఏడుకొండలు సిఐటియు మండల అధ్యక్షులు ఆకుల శ్రీనివాసరావు, మండలం యుటిఎఫ్ నాయకులు రామకృష్ణ శ్రీనివాసరావు రామారావు రాజశేఖర్ రంగా వెంకటేశ్వరరావు మురళీకష్ణ ఆనందమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఐసిఐసిఐ హోమ్ సేవల విస్తరణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ సేవలను విస్తరించేందుకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు బ్యాంకు రీజనల్ ఇన్‌ఛార్జి ఎ.కె.రామ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగానే కృష్ణా జిల్లా కేంద్రమైన మచిలీ పట్నంలో నూతన శాఖను ప్రారంభించినట్లు తెలిపారు. కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల్లో సంస్థ శాఖలను విస్తరించనున్నట్లు తెలిపారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - తిరువూరు : యుటిఎఫ్ రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను దాతల సహకారంతో తిరువూరు బాలికోన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థినులకు ప్రధాన ఉపాధ్యాయులు పి.సత్యనారాయణరాజు పంపిణీ చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు భరత కుమారి, జయశ్రీ, తదితరులు 100 మంది విద్యార్థులకు, బాణాల రవి (సాఫ్ట్‌వేర్ ఇంజనీర్) 13 మంది విద్యార్థులకు, మరిం గంటి మురళి నరసింహ కష్ణమాచార్యులు జ్ఞాపకార్థం గా 25 మంది విద్యార్థులకు కుమారుడు శేషు మాస్టారు పదో తరగతి స్టడీ మెటీరియల్‌ను అందజేశారు.

25 వరకు పత్తి కొనుగోలు నిలిపివేత

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల మార్కెట్ యార్డులో ఈ నెల 25 వరకు సిసిఐ పత్తి కొనుగోలు నిలిపివేస్తున్నట్లు మార్కెట్ యార్డు కార్యదర్శి కె.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. గుంటూరులో స్పిన్నింగ్ మిల్లులలో ముడి పత్తి, పత్తి విత్తనాలు ఎక్కువ మొత్తంలో నిల్వాలు ఉన్నాయన్నారు. దీనికి తోడు వాతావరణంలో మంగు ఏర్పడి తుఫాన్ ప్రభావంతో ఈ నెల 25వ తేదీ వరకు పత్తి కొనుగోలు నిలిపివేస్తున్నట్లు సిసిఐ బయ్యర్ సూచనలు మేరకు పత్తి కొనుగోలు నిలిపివేస్తున్నట్లు తెలిపారు. కంచికచర్ల, వీరులపాడు మండలాల పరిధిలో పత్తి రైతులు మార్కెట్ యార్డుకు పత్తి నిల్వాలను తీసుకరావద్దని సూచించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.